Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 173 మేడ్చల్ మల్కాజ్‌గిరి 14 జూలై 2023 శుక్రవారం పేజీలు : 4

### పాక్ సంక్షోభం.. కనిష్ఠ స్థాయికి పడిపోయిన రూపాయి

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేం దుకు వీలుగా అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి రుణాలు పొం దేందుకు పాక్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తాజా పాకిస్థాన్ రూపా యి మారకపు రేటుపై నిబంధనను సరళతరం చేసింది. దీంతో డాలరుతో పాక్ రూపాయి మారకపు విలువ 255కి పడిపోయింది. పాక్ చరిత్రలో ఇంత పెద్దమొత్తంలో రూపాయి పతనం కావడం ఇదే తొలిసారి. ఐఎంఎఫ్ సూచన మేరకు పాకిస్థాన్ ద్రవ్యమారకపు రేటుపై నిబంధనలను సడలించింది. దీంతో ఒక్క రోజులోనే పాక్ రూపాయి రూ. 24 మేర క్షీణించినట్లు ట్రిబ్యూన్ వెల్లడించింది. రూపాయిపై పాక్ ప్రభుత్వం నియంత్రణలను సరళీకరించాలని, రూపాయి మారకపు విలువను మార్కెట్ నిర్ణయించేలా చూడాలని ఐఎంఎఫ్ పాకిస్థాన్‌ను కోరింది.

# హ్యాట్రిక్ కొడితే...

# కేసీఆర్ ఢిల్లీకే...!



## సీఎంగా కేటీఆర్‌కు ప్రమోషన్!!

హైదరాబాద్ : మూడోసారి అధికారంలోకి వచ్చి బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టాలని కేసీయార్ చా లా ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తర్వాత సీఎం ఎవరు ? ఇదేం పిచ్చి ప్రశ్న అని అనుకుంటున్నారా ? అవును అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునేది కేసీయార్ అయినప్పటికీ మంచి ముహూర్తం చూసుకుని కొడుకు కేటీఆర్ కు పట్టం కట్టడం ఖాయమని పార్టీలో చర్చ జరుగా సాగుతోంది. నిజానికి ఈ ప్రచారం ఇపుడు కొత్తేమీ కాదు చాలా కాలంగా జరుగుతున్నదే. కేసీయార్ ఆరోగ్యం బాగోలేదని తొందరలోనే కేటీయార్ సీఎం అవుతారంటు బాగానే ప్రచారం జరిగింది. అయితే ఎప్పటికప్పుడు ప్రచారం ప్రచారంగానే మిగిలిపోయింది. అయితే ఇపుడు జరుగుతున్న ప్రచారానికి కాస్త లాజిక్కుంది. ఎందుకంటే కేసీయార్ జాతీయ రాజకీయాలపైన ఎక్కువగా దృష్టిపెడుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉంటు జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించటం సాధ్యంకాదు. అందుకనే గతంలో జయలలిత చంద్రబాబునాయుడు ములాయంసింగ్ యాదవ్ లల్లూ ప్రసాద్ యాదవ్ లాంటి వాళ్ళు ఆ విషయం ఆలోచించలేదు. జయలలిత ముఖ్యమంత్రిగానే చనిపోయారు.

మిగిలిన వాళ్ళల్లో ములాయం లాలూ దేవేగౌడ లాంటి వాళ్ళు ముఖ్యమంత్రులుగా తాము తప్పుకుని జాతీయ రాజకీయాలకే పరిమిత మయ్యారు. రాజ్యసభకో లేకపోతే లోక్ సభ ఎంపీగానో గెలిచి ఢిల్లీలోను ఉండిపోయారు. అందుకనే జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించగలిగారు. చంద్రబాబు సీఎంగానే ఉండిపోయారు కాబట్టి అవసరమైనపుడు మాత్రమే ఢిల్లీకి వెళ్ళే వాళ్ళు. మొత్తానికి ముఖ్యమంత్రిగా ఉంటూ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలంటే కష్టమే. అం దుకనే ముఖ్యమంత్రిగా కేటీయార్ కు పట్టంకట్టేసి తాను ఢిల్లీకి వెళ్ళిపోవాలని కేసీయార్ డిసైడ్ అయ్యారట. ఈ ఆలోచనతోనే రాష్ట్రంలో పార్టీ బాధ్యతలతో పాటు ప్రభుత్వ బాధ్యతలు కూడా ఎక్కువగా కేటీయార్ కే అప్పగించేశారు. కేటీయార్ కు కొన్ని శాఖలున్నప్పటికీ చాలా శాఖలను అనధికారికంగా కేటీయార్ పర్య వేక్షిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇదంతా ఎప్పుడంటే బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తే మాత్రమే.

అదికూడా మంచి మెజారిటితో రావాలి. ఇదే సమయంలో ఎంపీ స్థానాల్లో కూడా మ్యాగ్జిమమ్ సీట్లను బీఆర్ఎస్ సాధించినపుడే సాధ్యమవుతుంది. మరి చివరకు ఏమి జరుగుతుందో చూడాల్సిందే.

## రేవంత్ ఉచిత కరెంట్ ఉచ్చులో బీఆర్ఎస్.. పేటెంట్ అస్త్రాన్ని తీసిన కాంగ్రెస్

హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రస్తుతం వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అంశం సెగలు రేపుతోంది. పీసీపీ చీఫ్ రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఏ ముహూర్తాన ప్రకటన చేశారో కానీ.. అధికార బీఆర్ఎస్ పార్టీ అంతకు రెండింతలు స్పందించింది.

ఏకంగా రెండు రోజుల పాటు ఆందోళనలకు పిలుపు నిచ్చింది. ప్రతిగా బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతాంగానికి వ్యవసాయ విద్యుత్తు సరఫరా సక్రమంగా లేదంటూ కాంగ్రెస్ సబ్ స్టేషన్ల వద్ద ఆందోళనలకు శ్రేణులను సమాయత్తం చేసింది.

**ఎవరిది పేటెంట్..? ఎందుకీ రగడ..** వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు హామీ 20 ఏళ్ల కిందటది. అప్పట్లో అంటే 2004 సమయంలో రైతులు కరువులో చిక్కుకున్నారు. అదే సమయంలో చంద్రబాబు ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలు మరింత భారమయ్యాయి. దీనిని ఆసరాగా చేసుకుని వైఎస్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు హామీనిచ్చింది. ఇది బాగా వర్కవుట్ అయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే ఆ తర్వాత పలు నిబంధనలు ప్రవేశపెట్టినా కాంగ్రెస్ పాలనలో ఉచిత విద్యుత్తు కొనసాగించారు. తెలంగాణ వచ్చాక సైతం ఈ పథకాన్ని బీఆర్ఎస్ సర్కారు యథావిధిగా కొనసాగిస్తూ పున:పరిశీలన అనే పాయింట్ జోలికే వెళ్లలేదు. ఏం చేసినా రైతుల అంశం కాబట్టి పెద్దఎత్తున రగడ జరిగే వీలుంది. అందులోనూ కేసీఆర్ కు వ్యవసాయం సంగతి బాగా తెలిసినది కావడంతో ఉచిత విద్యుత్తు అమలుకు ఎదురులేకుండా పోయింది.

**కావాలనే లాగారా? :** తెలంగాణలో ఎన్నికలకు నాలుగే నెలల వ్యవధి ఉంది. బీఆర్ఎస్ కు పోటీ కాంగ్రెస్సే అనే వాతావరణం ఏర్పడింది. కర్ణాటక ఎన్నికల విజయంతో కాంగ్రెస్ తెలంగాణలోనూ గెలిచేంత సానుకూల వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులకు తాము ఎంతగా మేలు చేశామో చెప్పేందుకు కాంగ్రెస్ కు ఉచిత విద్యుత్తును మించిన మరో అంశం లేదు. దీంతోనే ఈ హామీ గురించి రేవంత్ ప్రస్తావించినట్లు కనిపిస్తోంది. తొలుత వివాదం రేగినా.. అసలు పథకం తీసుకొచ్చింది ఎవరు..? దానిని ఇప్పుడు ఎలా అమలు చేస్తున్నారు..? అంటూ పెద్ దఎత్తున చర్చ జరిగే అవకాశం ఉండడంతో పాటు ఎవరేం చేశారో తేలిపోనుంది. అయితే రేవంత్ చేసిన ప్రకటనకు బీఆర్ఎస్ స్పందన చాలా అనూహ్యంగా ఉంది. ఆ పార్టీ నాయకత్వం మొత్తం తీవ్ర స్థాయిలో మండిపడుతోంది. అలా రేవంత్ పన్నిన ఉచిత విద్యుత్తు ఉచ్చులో అధికార బీఆర్ఎస్ చిక్కుకుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది.



## బోనాలు పండుగకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

హైదరాబాద్: బోనాల పండుగ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గురువారం ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి గుడి, సఫిల్ గూడ కట్టమైసమ్మ గుడిని రాచకొండ సీపీ డి.ఎస్.చౌహాన్ సందర్శించారు. బోనాల పండుగ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను రాచకొండ సీపీ ఆదేశించారు. మల్కాజిగిరిలో ఆదివారం, సోమవారం జరగబోయే బోనాల ఉత్సవాల సందర్భంగా ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి గుడి, సఫిల్ గూడ కట్టమైసమ్మ గుడిని సీపీ చౌహన్ సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. బోనాల పండుగ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సాధారణ భక్తులకు ఈసారి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. షీ టీం బృందాలు కూడా మహిళా భక్తుల రక్షణ కోసం విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. భక్తులు పోలీసు వారికి సహకరించాలని, సంతోషంగా బోనాల పండుగ జరుపుకోవాలని ఆకాక్షించారు.

# కరిగిపోతున్న మోడీ ప్రభ...!



## 2024లో 'మొనగాడి' వైభవం ముగియనుందా...?

ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికి తొమ్మిదేళ్ళుగా దేశానికి ప్రధానిగా ఉన్నారు ఇక అంతకు ముందు ఆయన గుజరాత్ వంటి సంపన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పదమూడేళ్ళ పాటు పనిచేశారు. ఇక మోడీ రెండు పర్యాయాలు కేంద్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకుని వచ్చారు. బీజేపీకి మొదటిసారి 280 పై దాటి సీట్లు వచ్చాయి. 2019లో 304 సీట్లు వచ్చాయి.

దాంతో ఆయనే బీజేపీకి ఏకైక ఆప్షన్ అయ్యారు. తిరుగులేని నేతగా మారారు. కానీ 2024లో అలా జరుగుతుందా అన్నదే బీజేపీ లోపలా బయటా చర్చగా ఉంది. బీజేపీ మిత్రులు కలుపుకుని అంటే ఎన్డీయేకు 300 పైబడి ఎంపీ సీట్లు వస్తాయని ఈ మధ్యనే టైమ్స్ నౌ సర్వే చెప్పింది. అది కూడా ప్రస్తుతం ఎన్నికలు జరిగితే అని పేర్కొంది. ఇక 2019లో ఎన్డీయేకు 350 కి పైగా సీట్లు వచ్చాయి. అయితే 2023 జూన్ నాటికి ఆ నంబర్ 300కి పడిపోయింది. అంటే యాభై సీట్లకు కోత పడింది. సరిగ్గా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిగితే 2024 నాటికి ఈ నంబర్ నుంచి మరో యాభై సీట్లు గల్లంతు అయితే చాలు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చే సూచనలు ఉండవని అంటున్నారు. అందుకే బీజేపీ కంగారు పడుతోంది అని అంటున్నారు. ఏ విధంగా చూసిన బీజేపీ 250 నంబర్ దగ్గర ఆగితే 273 మ్యాజిక్ ఫిగర్ ని చేరుకోవడానికి ఇతర మిత్రుల సాయం అవసరం అని అంటున్నారు. ఈ నేపధ్యంలో బీజేపీ కొత్త మిత్రుల వేటలో పడింది అని అంటున్నారు. ఈ నెల 18న జరిగే ఎన్డీయే కీలక సమావేశంలో ఈ అంశం మీద కూడా చర్చ సాగనుంది అంటున్నారు. అదే విధంగా చూస్తే మోడీకి హ్యాట్రిక్ ప్రధాని అయ్యే యోగం ఉందా లేదా అన్నది కూడా కొత్త మిత్రుల చేరిక మీదనే ఆధారపడి ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం బీజేపీకి సొంతంగా మెజారిటీ ఉంది కాబట్టి మోడీని ఎవరూ కాదనడంలేదు. రేపటి రోజున బీజేపీకి మెజారిటీ తగ్గితే పాత మిత్రులతో పాటు కొత్త మిత్రులు కూడా మోడీని తప్పుకోమని కోరే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. అదే జరిగితే కనుక ముచ్చటగా మూడవసారి ప్రధాని అయ్యే యోగాని మోడీ కోల్పోతారని అంటున్నారు. ఇక ఏపీ నుంచి తెలుగుదేశం లాంటి పాత ఎన్డీయే మిత్రులు బీజేపీలో చేరితే ఎన్నికల అనంతరం బీజేపీలో మోడీని కాదని కొత్త ప్రధానిని ముందుకు తెచ్చే ప్రతిపాదన కూడా ఊపందుకునే అవకాశం ఉందని అంటున్నారు. అపుడు రేసులో నితిన్ గడ్కరీ వంటి వారు ముందు వరసలో ఉంటారని చెబుతున్నారు. దీంతోనే బీజేపీ పాత మిత్రులను తెచుకోవడంలో కూడా ఆచీ తూచీ ఆలోచిస్తోంది అని అంటున్నారు. ఈ కారణంగానే మోడీ టీం ఏపీలో అటు వైసీపీ చెలిమిని వదులుకోలేక ఇటు చంద్రబాబుని కూడా తమతో కలుపుకుని పోతూ డబుల్ యాక్షన్ చేస్తోంది అని అంటున్నారు. ఇవన్నీ చూస్తూంటే మోడీ మూడవసారి ప్రధాని కల నెరవేరడం కష్టసాధ్యమే అని అంటున్నారు. ఇక బీజేపీ 2024 ఎన్నికల జాతకం తేలాలి అంటే దాని కంటే ముందు ఈ ఏడాది డిసెంబర్ లో జరిగే అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో కనీసం మూడు అయినా బీజేపీ తన ఖాతాలో వేసుకోవాల్సి ఉంటుంది అని అంటున్నారు. అందులో పెద్ద రాష్ట్రం అయిన మధ్యప్రదేశ్ అలాగే రాజస్థాన్ తో పాటు అయితే తెలంగాణా లేకపోతే చత్తీస్ ఘడ్ బీజేపీ కచ్చితంగా గెలుచుకుని తీరాలి. ప్రస్తుతానికి చూస్తే ఒక్క రాజస్థాన్ విషయంలోనే బీజేపీకి ఆశలు ఉన్నాయి. మధ్యప్రదేశ్ లో యాంటీ ఇంకెంబెన్సీ కీలక పాత్ర పోషిస్తోంది. మధ్యప్రదేశ్ రాజస్థాన్ అయినా గెలుచుకుంటే బీజేపీకి 2024 లోక్ సభ ఎన్నికల్లో ఫిఫ్టీ ఫిఫ్టీ చాన్సెస్ ఉంటాయి కానీ కేవలం రాజస్థాన్ గెలిచినా సుఖం లేదని అంటున్నారు. ఇక రాజస్థాన్ లో కూడా ఈసారి టఫ్ ఫైట్ సాగనుది బీజేపీకి అంత ఈజీగా కాదు అన్న మాట ఉంది. దాంతో మోడీ హ్యాట్రిక్ పీఎం ఆశలు ఒక వైపు బీజేపీ భవిష్యత్తు మరో వైపు కమలనాధులకు కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్నాయని అంటున్నారు.

# సంపాదకీయం

## తొందరలో మినీ జమిలి ఎన్నికలా ?

ఎన్నికల నిర్వహణ విషయం లో రోజుకో విషయం బయటపడుతోంది. తాజాగా కేంద్రం నుండి అందుతున్న సంకేతాల ను బట్టి నరేంద్రమోడీ మినీ జమిలి ఎన్నికల కు వెళ్ళే ఆలోచన లో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకపుడు నరేంద్ర మోడీ జమిలి ఎన్నికల నిర్వహణ పై చాలా దృష్టిపెట్టారు. అయితే అది అనుకున్నంత ఈజీ కాదని అర్థమైపోయింది. అందుకనే ఇపుడు సడెన్ గా మినీ జమిలి ఎన్నికల గురించి ఆలోచిస్తున్నట్లు సమాచారం. మినీ జమిలి ఎన్నికలకు వెళ్ళాలనే ఆలోచనకు కూడా కారణముంది. అదేమిటంటే ఈ డిసెంబర్ నెల లో ఐదురాష్ట్రాల ఎన్నికలు జరగాల్సుంది. అలాగే రాబోయే మే-జూన్ నెల లో మరో ఆరు రాష్ట్రాలకు ఎన్నికలు జరగబోతున్నాయి. అలాగే జమ్మూ-కాశ్మీర్ ఎన్నికలు పెండింగు లో ఉన్నాయి. అంటే మొత్తం 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సుంది. వీటికి అదనంగా మే-జూన్ నెలలోనే పార్లమెంటు ఎన్నికలు కూడా జరగాలి. అంటే కొద్దినెలల తేడాలోనే కాస్త ముందు వెనుకగా అసెంబ్లీ ఎన్నికలతో పాటు మధ్యలో పార్లమెంటు ఎన్నికలు కూడా నిర్వహించాలి. ఇలా ఏడాదంతా ఎన్నికలు నిర్వహించాలంటే అందులోను అసెంబ్లీకి ఒకసారి పార్లమెంటుకు మరోసారి ఎన్నికలు నిర్వహించాలంటే వందల కోట్లరూపాయలు ఖర్చు విపరీతమైన మ్యాన్ పవర్ కావాలి. ఇదికాకుండా చాలా శ్రమతో కూడిన వ్యవహారం. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని డిసెంబర్లో జరగాల్సిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ను ఓ మూడునెలలు వాయిదా వేస్తే ఒకటేసారి 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలుంపార్లమెంటు ఎన్నికలు జరిపేయచ్చని మోడీ ఆలోచిస్తున్నారట. ఆరుమాసాల ముందుగానే అసెంబ్లీ ఎన్నికలను ముందుగా నిర్వహించటం కేంద్ర ఎన్నికల కమీషన్ చేతి లోని పనే. కానీ పొడిగించాలంటే రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మాత్రమే సాధ్యం. కాబట్టి ఐదురాష్ట్రాల ఎన్నికలను ఒక మూడు మాసాలు పొడిగిస్తే ఒకేసారి 12 రాష్ట్రాలతో పాటు పార్లమెంటు ఎన్నికలు కూడా జరిపేయచ్చు. అందుకనే దీన్ని మినీ జమిలి ఎన్నికలని అంటున్నది. ఇప్పటివరకు పార్లమెంటు కు విడిగా అసెంబ్లీల కు విడి గా ఎన్నికలు నిర్వహిస్తే ఫలితాలు వేర్వేరుగా వస్తున్నాయి. మరి మినీ జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఎలా గుంటుందో చూడాలి.

# ఇ-శ్రమ్‌పై అవగాహన కరవు



జనగామ : అసంఘటిత రంగంలోని కార్మికులు, వలస కార్మికులు, చిరు వ్యాపారులకు భరోసా కల్పించేందుకు కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ ఇ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీంతో కార్మికుల సంక్షేమం కోసం వివిధ సామాజిక భద్రతా పథకాలను మరింత మెరుగ్గా అమలు చేయడానికి వీలవుతుంది. కామన్ సర్వీస్ కేంద్రాల్లో (సీఎస్‌సీ) కార్మికులు ఉచితంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ పోర్టల్‌ను ప్రారంభించి ఏడాది అయింది. కొందరికి అవగాహన లేక, మరికొందరికి అవగాహన ఉన్నా దరఖాస్తు చేసుకోకపోవడంతో సంక్షేమ పథకాలకు, హక్కులకు దూరమవుతున్నారు.

ప్రయోజనాలివి

అసంఘటిత రంగంలోని కార్మికులు ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే 12 అంకెలు కలిగిన ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ అంగవైకల్యం చెందితే రూ.లక్ష బీమాను ఉచితంగా అందజేస్తారు. వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి వారికి ఉపాధిమార్గాలను చూపిస్తారు. కార్మికుడిగా నమోదైతే ప్రభుత్వమే తోడ్పాటు అందిస్తుంది. అనేక మంది కార్మికుల పోర్టల్‌లో నమోదు చేసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు మాత్రమే కార్మికశాఖ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

అర్హులు ఎవరంటే !

ఈ పథకంలో చేరదల్చుకున్న కార్మికులు అసంఘటిత రంగంలో తప్పనిసరిగా పని చేయాలి. 16 నుంచి 59 ఏళ్లలోపు వయసున్న వారు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేనివారు, వ్యవసాయ కూలీలు, దాని అనుబంధరంగాల్లో పని చేసేవారు, చిన్న, సన్నకారు రైతులు, ఉమ్మడి వ్యవసాయదారులు, మత్స్యకారులు, ఉద్యానవనాల్లో పనిచేసే కూలీలు, బావుల తవ్వకం, పూడిక తీసే కూలీలు, వీధి వ్యాపారులు, దుకాణాల్లో పని చేసే గుమస్తాలు, చిరుతోపుడు బండ్లవారు, వడ్రంగులు, ఎలక్ట్రీషియన్లు, ఆదాయపన్ను పరిమితిలోపు ఉన్నవారు, చేనేత, ఇటుకబట్టీలు, క్వారీలు, మిల్లులు, ఉపాధి కూలీలు, ఆశ, అంగన్‌వాడీ ఆయాలు, రిక్షావాలాలు, ఆటోడ్రైవర్లు, కూరగాయల వ్యాపారులు, పండ్ల విక్రేతలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే దినసరి కూలీలు ఈ పథకంలో చేరేందుకు అర్హులు.

ఇంకా 10 వేల మంది !

జిల్లాలోని 70 వేల పైచిలుకు కార్మికుల్లో ఇంకా 10 వేల మందికి పైగా ఇ-శ్రమ్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. ఆరంభంలో అధికారుల అవగాహన కార్యక్రమాలు, కార్మిక సంఘాల నేతల సూచనలతో నమోదు చేసుకునేందుకు కార్మికులు పోటీ పడ్డారు. క్రమంగా ఇ-శ్రమ్ పోర్టల్‌ను ఆశ్రయించేవారు లేకపోవడంతో ఆదరణ కరవవుతోంది. ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

అందరూ ముందుకు రావాలి

ఇ-శ్రమ్‌కు ఆదరణ బాగానే ఉంది. ఇప్పటి వరకు నమోదు చేసుకోని అసంఘటిత కార్మికులందరూ తప్పనిసరిగా ఇ-శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. కార్మికశాఖ అందించే సంక్షేమ పథకాలకు అర్హులవుతారు. నమోదు చేసుకునేందుకు నిర్ణీత గడువంటూ ఏమీ లేదు. ఆధార్‌కార్డుతో చరవాణి నెంబర్ అనుసంధానమైన వారు సమీపంలోని మీసేవా కేంద్రాలు, సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లి ఐదు నిమిషాల్లో నమోదు చేసుకోవచ్చు కార్మికశాఖ జారీ చేసే గుర్తింపుకార్డుతో ప్రయోజనాలు పొందేందుకు ఆస్కారం ఉంటుంది.
– కుమారస్వామి, జిల్లా కార్మికశాఖ అధికారి

ఇలాంటి పథకాలు ఎంతో అవసరం

ఇ-శ్రమ్‌తో కలిగే ప్రయోజనాల గురించి నా తోటి కార్మికుడు వివరించారు. ఈ పథకంలో నేను ఇటీవలే భాగస్వాముడిని అయ్యాను. రెక్కాడితే గానీ డొక్కాడని మా కార్మికుల కుటుంబాలకు ఇలాంటి పథకాలు ఎంతో అవసరం. జిల్లాలోని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరూ తప్పనిసరిగా ఇ-శ్రమ్‌లో నమోదు చేసుకోవాలి. – మాల్ల కుమార్, నిడిగొండ

జిల్లాలోని కార్మికుల సంఖ్య : 71,664 ఇ-శ్రమ్‌లో నమోదు చేసుకున్నవారు : 60,000 నమోదు కావాల్సిన వారు : 11,664

# నల్లా వస్తేనే ఒకటికి.. రెండుకు!




జనగామ : పరకాల పట్టణంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌కు నీటి కరవు వచ్చింది. దానికి సంబంధించిన విద్యుత్తు మోటారు కాలిపోగా పాలకవర్గం, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. స్థానిక అమరధామం పక్కనే సుమారు రూ.10 లక్షల వ్యయంతో ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలను నిర్మించారు. ప్రత్యేకంగా బిగించిన రెండు ట్యాంకులకు నీటిని మళ్లించే బోరు మోటారు రెండు నెలల కిందట కాలిపోయింది. నాటి నుంచి మరమ్మతులు లేకపోగా, కేవలం దినం తప్పించి దినం ఇచ్చే నల్లాలు వచ్చినప్పుడే ట్యాంకులను నింపి పబ్లిక్ టాయిలెట్స్‌ను తెరుస్తున్నారు. నీరు అయిపోయిన వెంటనే తాళం పడుతోంది. నల్లా రాకుంటే నీరు లేక నిర్వాహకులు తాళం తీయట్లేదు. వివిధ అవసరాల కోసం ఇక్కడికి వచ్చే ప్రజలు ఒకటికి, రెండుకు తిప్పలు పడుతున్నారు. మహిళల బాధలు అయితే ఎవరికీ చెప్పలేనివి. పురపాలక సంఘం కార్యాలయం వెనక ఉన్న ఈ పబ్లిక్ టాయిలెట్స్ గురించి రెండు నెలలుగా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని, నీటిని అందివ్వనప్పుడు రూ.లక్షలు వెచ్చించి ఎందుకు నిర్మించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మా దృష్టికి రాలేదు : వంశీకృష్ణ, పురపాలక ఇన్‌ఛార్జి ఏఈ

మోటారు కాలిపోయిన విషయం నా దృష్టికి రాలేదు. మోటారును బాగు చేయించి ప్రజా మరుగుదొడ్లను తెరిచేలా చర్యలు తీసుకుంటాం.

# పన్ను రాయితీ ప్రకటించినా.. అంతంతే!



మహబూబాబాద్ : పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను చెల్లించకుండా బకాయిపడిన వారికి ప్రభుత్వం విధించిన అపరాధ రుసుం చెల్లింపులో 90 శాతం రాయితీ ప్రకటించినా గృహ యాజమానులు బకాయిలు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. వడ్డీ భారం తగ్గి వాస్తవ పన్ను చెల్లించాలని పురపాలక అధికారులు, సిబ్బంది పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నా వారిలో మాత్రం స్పందన కనిపించడం లేదు. ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తూ బకాయిపడిన వారికి ప్రభుత్వం ఆస్తి పన్నుపై వడ్డీ వసూలు చేస్తోంది. ఆస్తిపన్నుతో పాటు అదనంగా వడ్డీ భారం పడుతోంది. వివిధ కారణాలతో ఇంకా రుసుం చెల్లించకుండా మొండికేస్తున్న బకాయిదారుల నుంచి పన్నులను రాబట్టేందుకు వడ్డీ భారాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం వారికి మరొక అవకాశం కల్పించింది. వారి నుంచి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలో 90 శాతం రాయితీనిచ్చింది. ఇంటి పన్నుతో పాటు కేవలం పది శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలని సూచిస్తూ 2022 జులై 16న నెం.485 ఉత్తర్వును జారీ చేసింది. జిల్లాలోని మహబూబాబాద్ పురపాలక సంఘంతో పాటు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ పురపాలక సంఘాల్లోనూ బకాయిదారులు రాయితీని వినియోగించుకోవడంలో లేదు.మరో నెల గడువుపట్టణాల్లో 2021-22 ఆర్థిక సంవత్సరం వరకు బకాయి పడిన వారందరికీ ఈ వడ్డీ రాయితీ అవకాశం కల్పించింది. జులై 18 నుంచి 2022 అక్టోబర్ 31 వరకు అపరాధ రుసుంలో 90 శాతం మినహాయించి మిగిలిన పది శాతం వడ్డీ, పన్ను బకాయి మొత్తాన్ని ఏకకాలంలో చెల్లించే విధంగా నిర్ణీత గడువు నిర్ణయించింది. మీ సేవ కేంద్రాలు, పురపాలక సంఘం కార్యాలయంలోనే ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. బిల్ కలెక్టర్ లేదా అంతర్జాలంలో చెల్లింపులు చేసే విధంగా అవకాశం కల్పించి నెల పదిహేను రోజులు దాటినా బకాయిదారులు మాత్రం ఆసక్తి చూపడం లేదు.విస్తృత ప్రచారం నిర్వహించాం – కె.ప్రసన్నరాణి, కమిషనర్, మహబూబాబాద్ఆస్తి పన్నుల బకాయిలపై ప్రభుత్వం కల్పించిన 90 శాతం రాయితీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ప్రచారం చేయించాం.

# ఉచిత పరీక్షలకు ఆదరణ

సిరిసిల్ల : జ్వరమొచ్చి రక్త పరీక్షలు చేయించుకుంటే ప్రైవేటులో వేలరూపాయల్లో ఖర్చవుతుంది. ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరితే ఇక అంతే సంగతులు. పట్టణ ప్రాంతాల్లో అయితే సగటున ఒక్కో కుటుంబం రోగ నిర్ధారణ పరీక్షలకు రూ.26వేలు ఖర్చుచేస్తున్నట్లు ఆరోగ్యశాఖ నివేదికల్లో వెల్లడైంది. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఎవరికైనా జబ్బుచేస్తే ఆర్థికంగా కుంగిపోవాల్సిదే. ఈ పరిస్థితుల నుంచి ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం టీహబ్ (తెలంగాణ డయాగ్నోస్టిక్స్)ను జిల్లాలో గతేడాది ఫిబ్రవరిలో ప్రారంభించింది. 18 నెలలుగా కార్పొరేట్ ఆసుపత్రులకు ఏ మాత్రం తీసిపోని విధంగా జిల్లాలో సేవలందిస్తోంది. 47రకాల రక్త, మూత్ర పరీక్షలతోపాటు డెంగీ, చికున్ గన్యా, సీబీపీ, లిపిడ్ ప్రొఫైల్ తదితర పరీక్షలను ఈ పథకం కింద రోగులకు పూర్తి ఉచితంగా అందజేస్తున్నారు.జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలతోపాటు జిల్లా ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రికి వచ్చే రోగులకు అక్కడ సాధారణ పరీక్షలు చేస్తారు. వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రక్త నమూనాలను టీహబ్‌కు పంపుతారు. జిల్లా వ్యాప్తంగా మూడు వాహనాల ద్వారా సిరిసిల్లలోని టీ హబ్‌కు తరలిస్తారు. రోజుకు సగటున 350 నుంచి 400కు పైగా పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పూర్తయ్యాక నేరుగా రోగి సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సందేశం వస్తుంది. ఆరోగ్యకేంద్రంలోని వైద్యుడిని సంప్రదిస్తే ఇతర వైద్యసేవలు, నివారణకు అవసరమైన మందులను సూచిస్తారు. ఇప్పటికీ 2.52 లక్షల రోగుల నుంచి 3.55 లక్షల నమూనాల సేకరించారు. వీటితో 11.13 లక్షల పరీక్షలు చేశారు. వీటి ద్వారా రోగులకు రూ.33.4 కోట్లు ఆదా అయింది.



వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి రావడంతో ఆరోగ్య కేంద్రాలకొచ్చే రోగుల సంఖ్య గతంలో కంటే సుమారు 30 శాతం పెరిగినట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. పూర్తి ఉచిత సేవలు అందుతుండటంతో రోగులు ఉదయం నుంచే బారులు తీరుతున్నారు.

అత్యాధునిక పరికరాలు

జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన హెల్త్‌ప్రొఫైల్‌తో టి-హబ్‌కు మరిన్ని అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.27 కోట్లతో నాలుగు సీబీపీ, ఆరు రక్తగ్రూపులు, సెంట్రల్ ప్యూజియర్ యంత్రాలు ఉన్నాయి. నమూనాల సేకరణ, విశ్లేషణ.. రిపోర్టులను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం పూర్తిగా ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో)తో నడిచేవి. వీటితో 47 రకాల పరీక్షలపై ఎల్‌ఐఎస్ (ల్యాబ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం) కంప్యూటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. ప్రస్తుతం ఇవి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ సాంకేతిక విభాగం పర్యవేక్షణలో ఉన్నాయి. జిల్లాలో పూర్తయిన హెల్త్‌ప్రొఫైల్ కార్డుల పంపిణీ పూర్తయితే ఇతర జిల్లాలో ప్రారంభించనున్నారు. అప్పుడు చుట్టుపక్కల జిల్లాల నుంచి వచ్చే నమూనాలను ఇక్కడే పరీక్షించనున్నారు. రోజుకు సగటున ఆరు వేల రక్తనమూనాలను పరీక్షించే సామర్థ్యం ఉంది.

# చెత్తశుద్ధి.. ఆగుతూ.. సాగుతూ!

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో చెత్త సమస్యను పరిష్కరించేందుకు ప్రారంభించిన బయోమైనింగ్ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది జూన్ 7 నుంచి ప్రక్రియ ప్రారంభించగా కొద్ది రోజుల పాటు చెత్త శుద్ధి జరిగింది. పూర్తిగా తొలగించే పనులు ఆగుతు.. సాగుతున్నాయి.

రూ.16.50కోట్లతో బయోమైనింగ్

శాస్త్రీయ విధానంలో చెత్తను ప్రాసెస్ చేసి ఘన వ్యర్థాల సమస్యను పరిష్కరించేందుకు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రాధాన్యం ఇచ్చారు. రూ.16.50కోట్లు కేటాయించి ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఒప్పందం చేసుకున్న ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉంటుండగా ఆ సమయంలో మూడు నెలల సమయం ముగిసింది. . యంత్రాల బెల్ట్ తెగిందని, విద్యుత్తు వైరింగ్ కాలిపోయిందని, వర్షాలకు మోటార్లు కాలి పోయాయని రోజుకు ఒక సమస్యను పేర్కొంటూ చెత్త ప్రాసెసింగ్ ఆలస్యం చేస్తున్నారు.



జూన్‌లో దీన్ని ప్రారంభించగా ఆ నెలలో 17రోజులు, జులైలో 2, ఆగస్టులో అయిదు రోజులు మొత్తం 24రోజుల్లో 440 ట్రిప్పుల చెత్తను శుద్ధి చేసినట్లు సమాచారం. ఇలా అయితే రెండేళ్లు అయినా డంపింగ్‌యార్డులో చెత్తంతా ఖాళీ కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శుద్ధి వ్యర్థాలు ఏం చేస్తున్నట్లో?

చెత్తను ఎక్కడికక్కడే శుద్ధీ చేస్తుండగా అందులోంచి వచ్చే వ్యర్థాలు ఏం చేస్తున్నారో తెలియకుండా మారింది. వాస్తవంగా సేంద్రియ ఎరువు నగరపాలక సంస్థకు అప్పగించాలి. దీనిని ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాత మొక్కలకు, పొలాలకు ఎరువుగా వినియోగించుకునే వీలుంటుంది. మిగతాది ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలించాల్సి ఉంటుంది.

దుర్వాసనతో అవస్థలు

నగరంలోని తడి, పొడి చెత్తను తీసుకొచ్చి డంపింగ్‌యార్డులో నిల్వ చేస్తున్నారు. వర్షానికి కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బయోమైనింగ్ సక్రమంగా కాకపోవడం, చెత్త గుట్టలు అలాగే ఉండటంతో ఆ యంత్రాలు పని చేస్తున్నాయా లేదా అనే విషయం కూడా తెలియకపోవడంతో చెత్త సమస్య మొదటికొస్తుందని అంటున్నారు. యంత్రాలు సక్రమంగా పని చేయడం లేదనే విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో గత రెండు రోజులుగా బయోమైనింగ్ తిరిగి మొదలయ్యాయి. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు బయోమైనింగ్ జరిగేలా పర్యవేక్షించాల్సిన అవసరముంది.

## కస్తూర్బాలో వసతుల కొరత

పెద్దపల్లి : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక వసతులు కొరవడడంతో బాలికలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఇప్పటి వరకు ఆరు నుంచి పదోతరగతి వరకు ఉండగా ఇంటర్ తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రస్తుతం 200 మంది బాలికలు ఉండాల్సి ఉండగా 240 మందికి ప్రవేశాలు కల్పించారు. దీనికి తోడు ప్రభుత్వం ఇంటర్ వరకు పెంచడంతో రెండు గ్రూపులలో మరో 80 మంది బాలికలు చేరుతున్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో బాలికలకే గదులు లేకపోవడంతో తరగతి, భోజనం, పడుకోవడం



ఒకే గదిలో కొనసాగుతున్నాయి. విద్యాలయానికి అందించిన శుద్ధజల ప్లాంట్ మరమ్మతులు చేయించకపోవడంతో బోరుబావి నీటిని వాడుకోవాల్సి వస్తోంది. మిషన్ భగీరథ పైపులైన్ వేసి గేట్ వద్దనే వదిలివేయగా నీరు రావడంలేదు. పై అంతస్తులో ఉంచి నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టగా అక్కడికి వెళ్లేందుకు మెట్లు లేకపోవడంతో వాటిని శుభ్రం చేయడం ప్రమాదకరంగా మారింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం- ప్రియదర్శిని, ప్రత్యేకాధికారి
విద్యాలయంలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం అయిదు గదులు ఉండగా వాటిలో తరగతులు నిర్వహిస్తున్నాం. నూతనంగా వచ్చే బాలికలకు డైనింగ్ హాల్‌లోనే వసతి కల్పిస్తున్నాం. ఇంటర్ వరకు పెంచడంతో ఇబ్బందిగా మారనుంది.

## కాళేశ్వరం జలాలకు నిరీక్షణ

నల్గొండ : యాదాద్రి భువనగిరి జిల్లాలోని కాళేశ్వరం కాలువలు నీరులేక వెలవెలబోతున్నాయి. సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ జలాశయం నుంచి విడుదల కావాల్సిన సాగునీరుని నిలిపి వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాళేశ్వరం జలాల కోసం నిరీక్షిస్తున్నారు. రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టుని నిర్మించింది. కరవు ప్రాంతంగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాకు సాగునీరు సరఫరా చేసి సస్యశ్యామలం చేయాలని నిర్ణయించింది. ప్రధాన కాలువలు నిర్మించగా మరికొన్ని ప్రగతిలో ఉన్నాయి. తక్షణ చర్యల్లో భాగంగా తీవ్ర కరవు మండలాలుగా ఉన్న తుర్కపల్లి, బొమ్మలరామారం ప్రాంతాలకు సాగునీరు అందించడానికి తుర్కపల్లి, ఎం.తుర్కపల్లి ప్రధాన కాలువలు నిర్మించారు. సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ జలాశయం నుంచి కాలువల్లోకి పోయిన పంటకు సాగు నీటిని విడుదల చేశారు. గుంట పొలం ఎండిపోకుండా వేసవిలోనూ పొలాలకు సాగునీరు అందించడంతో రైతులు సంతోషించారు. తుర్కపల్లి ప్రధాన కాలువ ద్వారా మండలంలోని గోపాల్‌పురం, నాగాయిపల్లి, చినలక్ష్మాపురం, మాదాపురం బొమ్మలరామారం మండలంలోని పలు గ్రామాలకు ఏప్రిల్ నెల వరకు సాగునీరు అందించారు. చెరువులు నిండి కళకళలాడాయి. అయితే రెండు నెలల నుంచి అర్ధాంతరంగా కాళేశ్వరం జలాలు



నిలిపివేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోతుంది.

వెలవెలబోతున్న చెరువులు
కాల్వల కింద ఉన్న చెరువులు, కుంటలు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. బోర్లు, బావులలో భూగర్భ జలాలు ఎక్కడికక్కడ తగ్గుముఖం పడుతున్నాయి. మండుటెండల్లో జలాలతో కళకళలాడిన చెరువులు నేడు గోదావరి జలాల రాక కోసం నిరీక్షిస్తున్నాయి. వానా కాలం మొదలై నెల రోజులు కావొస్తున్నా ఈ ప్రాంతంలో చినుకు జాడ లేదు. రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. అటు గోదావరి జలాలు రాక ఇటు వర్షాలు కురవక ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు. నాట్లు వేయడం ఆలస్యమవుతోంది.సాగునీరు విడుదలకు సన్నాహాలు: రాజశేఖర్, ఏఈ, కాళేశ్వరం ప్రాజెక్టుఅతి త్వరలో సాగునీరుని విడుదల చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏప్రిల్ వరకు సాగునీరు అందించాం. మే నుంచి తుర్కపల్లి ప్రధాన కాలువకు నీటి విడుదలను నిలిపివేసింది వాస్తవమే. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదు. త్వరలోనే గోదావరి జలాలు విడుదల చేస్తాం.

## తునికాకు సేకరణ.. డబ్బులకు నిరీక్షణ

ములుగు: తునికాకు సేకరణ జరిగి 20రోజులైనా కూలీలకు డబ్బులు అందలేదు. కూలి కోసం పేద కుటుంబాలు ఎదురుచూ స్తున్నాయి. గతంలో ఏ రోజు కూలి ఆ రోజే ఇచ్చే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆకు సేకరణ ప్రారంభంమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కూలీలకు నయా పైసా చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. తునికాకు సేకరణ చరిత్రలోనే ఇంత వరకు ఇలాంటి దుస్థితి ఎదురుకాలేదని కూలీలు చెబుతున్నారు.ఆన్‌లైన్‌లో చెల్లించాలని.. తునికాకు సేకరణకు ఈ సారి కొత్త పద్ధతిని అటవీశాఖ ప్రవేశపెట్టింది. గతంలో కూలీలు సేకరించిన తునికాకు కూలి డబ్బులు చేతికి ఇచ్చేవారు. ఈ ఏడాది బ్యాంక్ ఖాతాలో ఆన్‌లైన్ ద్వారా జమ చేయాలని నిర్ణయించారు. అయితే ఇది సక్రమంగా అమలు చేయకపోవడంతో దీని ప్రభావం కూలీలపై పడి, ఇబ్బందులు తప్పడం లేదు. వివరాలు ట్యాబ్‌లో నమోదు చేసి అదే రోజు కూలి డబ్బులు ఖతాలో జమ చేయాల్సి ఉంది. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాల కారణంగా, ట్యాబ్‌లు సరిగా పని చేయకపోవడం, కూలీల వివరాలు సరిగా నమోదు కాకపోవడం లాంటి కారణాలతో అటవీ శాఖ ప్రవేశపెట్టిన నూతన పద్ధతి ఆచరణకు నోచుకోలేదు. సమస్యను పరిష్కరించకుండా.. చేతికి డబ్బులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సీఎంఆర్ బకాయిలు రూ.100కోట్ల పైమాటే!



నల్గొండ : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియ కొన్ని మిల్లుల పాలిట కామధేనువుగా మారింది. రాజకీయ అండదండలు, కొందరు అధికారులు అమ్యామ్యాలకు లొంగి మిల్లర్లతో కుమ్మక్కు కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 100 కోట్ల విలువైన బకాయిలు ఇంకా ప్రభుత్వానికి రావాల్సి ఉందని తెలిసింది. ఇందులో ఒక్క సూర్యాపేట జిల్లాలోనే రూ. 85 కోట్లకు పైగా విలువైన బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గత రెండేళ్ల నుంచి సరైన సమయంలో ప్రభుత్వానికి సీఎంఆర్ అప్పగించని మిల్లులకు అధికారులు నోటీసులు అందిస్తూ వస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 89 మిల్లులకు నోటీసులిచ్చినా వారు స్పందించడం లేదని ఉన్నతాధికారులే వెల్లడిస్తున్నారు. బకాయిలు చెల్లించకుంటే ఆ మిల్లులను బ్లాక్ లిస్టులో ఉంచి ధాన్యం కేటాయింపులు చేయవద్దని ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించింది. అయితే రాజకీయ పలుకుబడితో మిల్లర్లు సదరు మిల్లులను బ్లాక్ లిస్టు నుంచి తీయించి అత్యధిక టన్నుల్లో తిరిగి ధాన్యాన్ని తమ మిల్లులకు కేటాయించేలా చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంలో రూ.కోట్లు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రూ. 80 కోట్లకు పైగా బకాయి ఉన్న జిల్లాల్లో సూర్యాపేట అగ్రస్థానంలో ఉంది. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం సూర్యాపేట జిల్లాలో సీఎంఆర్ బకాయిలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో కలెక్టరు వెంకట్‌రావు సోమవారం మిల్లర్లతో ప్రత్యేకంగా సమావేశమై సీఎంఆర్ బకాయిలు లేకుండా ప్రభుత్వానికి సహకరించాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రాజకీయ అండదండలతో..
నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో గత సీజన్ వరకు లెక్కలు పరిశీలిస్తే ఒక్క నల్గొండ జిల్లాలోనే సీఎంఆర్ లక్ష్యం పూర్తయింది. 2022-23 రబీ సీజన్ మిల్లింగ్ ప్రక్రియ మొదలైంది. యాదాద్రి జిల్లాల్లోనూ సుమారు 80 శాతం వరకు అధికారులు సీఎంఆర్ లక్ష్యాన్ని చేరుకోగా...సూర్యాపేటలో మాత్రం గత రెండేళ్లవే బకాయి ఉంటుండటం గమనార్హం. అసోసియేషన్‌లో కీలకంగా వ్యవహరించే ఓ మిల్లర్‌కు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో సుమారు 7 మిల్లులు ఉన్నాయి. వీటి బకాయిలు జరిమానాలతో కలిసి రూ. 19 కోట్ల వరకు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆయన ఒక్కరే దాదాపు 5,800 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా...రాజకీయ అండదండలతో ఇప్పుడు..అప్పుడు అంటూ దాట వేస్తున్నారని...అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకొందని తెలిసింది. యాదాద్రి జిల్లాకు చెందిన మరో మిల్లర్ సైతం రాష్ట్ర స్థాయిలో కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఆయన సైతం ప్రభుత్వానికి సుమారు రెండు వేల టన్నుల వరకు బియ్యాన్ని అప్పగించాల్సి ఉందని సమాచారం.

బకాయిదారుల మిల్లులను తనిఖీలు చేయాలని ఆదేశం
సూర్యాపేట కలెక్టరేట్: పాత, కొత్త సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లులను జిల్లా అధికారులు, తహసీల్దార్లు తనిఖీలు చేపట్టాలని సూర్యాపేట కలెక్టర్ వెంకటరావు ఆదేశించారు. ప్రజావాణిలో సోమవారం తహసీల్దార్లతో వెబెక్స్ ద్వారా మాట్లాడారు. ఎట్టిపరిస్థితుల్లో సీఎంఆర్ బకాయిలపై నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. బకాయి ఉన్న మిల్లులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. సెలవు రోజుల్లోనూ అధికారులు మిల్లులను పరిశీలించి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సీఎంఆర్‌పై నివేదిక అందించాలని పేర్కొన్నారు.

క్రిమినల్ కేసులు పెడతాంసీఎంఆర్ బకాయిలను సకాలంలో అందజేయాలని మిల్లర్లను ఆదేశించాం. స్పందించని వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించాం. సాధ్యమైనంత తొందరలో వారి నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను రాబడతాం.వెంకట్‌రావు, కలెక్టరు, సూర్యాపేట

# రాతకు మూత..!



మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని ప్రభుత్వం చెబుతున్నా.. నివేదికలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. కేరళ రాష్ట్రంలో 83 శాతం ప్రభుత్వ, 13 శాతం ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. మన రాష్ట్రంలో ప్రస్తుతం 47 శాతం ప్రభుత్వ, 53 శాతం విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని అధికారుల నివేదికలు చెబుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2001లో 84 శాతం ప్రభుత్వ, 16 శాతం ప్రైవేటు పాఠశాలల్లో చదివినట్లు నివేదికలే చెబుతున్నాయి. తక్కువగా చేరికలు ఉన్న పాఠశాలలను మూసివేసి సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేయడంతో పాటు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 శాతం పాఠశాలలు మూతపడనున్నాయి. మండల విద్యాధికారులు విద్యార్థుల సంఖ్య, హాజరుశాతం వివరాలు సేకరిస్తున్నారు.ప్రామాణికంగా తీసుకోవాల్సిన అంశాలు..

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7 తరగతుల్లో పది మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉంటే మూసివేయాలని నిర్ణయించారు. ఉన్నత పాఠశాలల్లో 30 లోపు చేరికలు ఉన్నట్లయితే వాటిని మూసివేసి సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి.

విస్తృతంగా పాఠశాలల ఏర్పాటు..
దేశంలో విద్యా ప్రమాణాల పెంపునకు 1986లో కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ బ్లాక్‌బోర్డు పథకం' ప్రారంభించింది. దీని నిధులతో గ్రామాలు, తండాలు, ఆవాసాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసి అక్షరాస్యత పెంపునకు కృషి చేసింది. 2010 విద్యాహక్కు చట్టంతో గ్రామానికి, తండాకు ఒక కిలోమీటరు దూరంలో ప్రాథమిక పాఠశాల, 3 కి.మీ. దూరంలో ప్రాథమికోన్నత పాఠశాల, గ్రామానికి 5 కి.మీ. దూరంలో ఉన్నత పాఠశాల ఉండాలని చట్టం చెబుతోంది. అలాంటి పరిస్థితి లేక దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటే రవాణా భత్యం రూ. 600 నెలకు ఇవ్వాలని నిర్ణయించారు.

కారణాలివే.. విద్యార్థుల కోసం కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, ఆదర్శ, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఏర్పాటు చేశారు. వీటిలో చేరేందుకు 6, 7 తరగతుల వారంతా ఆసక్తి చూపుతుండటంతో ఉన్నత పాఠశాలల్లో చేరికలు తగ్గిపోతున్నాయి. ప్రాథమిక స్థాయిలో ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకు తల్లిదండ్రులు తమ పిల్లల్ని అధికంగా ప్రైవేటు పాఠశాలల్లోనే చేర్పిస్తున్నారు.

కేరళ రాష్ట్రంలో ప్రధానంగా 40 వేల జనాభా ఉంటే ఒక్క ప్రైవేటు పాఠశాలకు మాత్రమే అనుమతిస్తారు. సొంత భవనం అన్ని సౌకర్యాలను మూడు దశల్లో తనిఖీలు చేసి అనుమతిస్తారు.

మన రాష్ట్రంలో ఎలాంటి అనుమతి సౌకర్యాలు లేకున్నా ప్రైవేటు పాఠశాలలు పదుల సంఖ్యలో ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.

నివేదిక సిద్ధం చేస్తున్నాం..
పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాల ఆధారంగా నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సూచనలకు అనుగుణంగా పిల్లలు లేనిచోట పాఠశాలలు మూసివేస్తున్నాం. విద్యార్థులను సమీప పాఠశాలల్లో చేర్పించటం, ఉపాధ్యాయులను అవసరమైన చోట సర్దుబాటు చేస్తాం.బాలాజీనాయక్,మండల విద్యాధికారి, మిర్యాలగూడ

## అన్నదాత చూపు ఆకాశం వైపు

పెద్దపల్లి : వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ తొలకరి చినుకు కరవైంది. ఆకాశం వైపు అన్నదాత చూసే పరిస్థితి నెలకొంది. విత్తులు నాటేందుకు దుక్కులు సిద్ధం చేసిన రైతులు నిరీక్షిస్తున్నారు. మృగశిర కార్తె నడుస్తున్నప్పటికీ రుతుపవనాల జాడ లేదు. గతంలో ఎన్నడు లేనివిధంగా జూన్ మూడో వారంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదు కాలేదు. వరుణుడుపై ఆశలు పెట్టుకున్న కొందరు రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో విత్తనాలు మాడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టెక్కించేందుకు ఈ ఏడాది వ్యవసాయ శాఖ సాగు కాలాన్ని ముందుకు తీసుకెళ్లాలని భావిస్తోంది. 2.83 లక్షల ఎకరాల సాగు లక్ష్యంజిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 2.83 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు కానుందని అంచనా వేశారు. ఇందులో 2.13 లక్షల ఎకరాల్లో వరి, 65 వేల ఎకరాల్లో పత్తి పంటలు సాగు కానున్నాయని వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గతేడాది 81,270 ఎకరాల్లో పత్తి అంచనా వేయగా భారీ వర్షాలతో కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నీటిలో పత్తి పంట మునగడంతో 64 వేల ఎకరాలకు పరిమితమైంది. జిల్లాలో ప్రధాన నీటి వనరులైన ఎస్సారెస్పీ నీరుపైనే ఆధార పడాల్సి వస్తోంది.వర్షపాతం లోటుజిల్లాలో గడిచిన రెండేళ్లలో గణాంకాలు పరిశీలిస్తే వర్షపాతం లోటు కనిపిసోంది. ఈ ఏడాదిలో మొత్తం 1035.8 మి.మీ. వర్షాపాతం అంచనా ఉంది. జూన్‌లో 91.5 మి.మీ. సాధారణ వర్షపాతం ఉండగా ఇప్పటి వరకు 4.5 మి.మీ. మాత్రమే నమోదైంది. గతేడాది ఇదే నెలలో 72.5 మి.మీ. వర్షం కురిసింది. మూడో వారం నడుస్తున్నా.. వర్షం కురియకపోడంతో పంటల సాగుపై సందిగ్ధం నెలకొంది. వాతావరణ శాఖ ఐదేళ్లకోసారి సాధారణ వర్షపాతం లెక్కించగా ప్రస్తుతం 30 ఏళ్లకు పొడిగించారు.

## అర్హులకు దక్కని పోడు!

మిర్యాలగూడ : ఏళ్ల తరబడి అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వం ఇటీవలే హక్కు పత్రాలు పంపిణీ చేసింది. అయితే పోడు పట్టాల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినా కేవలం వందల సంఖ్యలోనే పట్టాలు అందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,042 ఎకరాలకు 2,256 మంది గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. కాగా పోడు పట్టాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపికలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అనేక గ్రామాల్లో ఏళ్ల తరబడి సాగులో ఉన్న వారికి కాకుండా..అసలు సాగులో లేని వారికి పట్టాలు పంపిణీ చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

కార్యాలయాలకు పరుగులు
పలు గ్రామాల్లో అటవీ అధికారుల సర్వేతో పాటు గ్రామ కమిటీలు సిఫార్సు చేసిన వారికి సైతం పట్టాలు రాకపోవడంతో వారంతా తహసీల్, ఆర్డీవో కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. దామరచర్ల, తిరుమలగిరి సాగర్, అడవిదేవులపల్లి మండలాల నుంచి పలువురు రైతులు సోమవారం మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయానికి వచ్చి వినతి పత్రాలు సమర్పించారు. 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు వచ్చి.. రైతుబంధు అమలవుతుందని ఆశపడితే అడియాసే మిగిలిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అర్హులైన వారికి పోడు పట్టాలు అందించాలని



బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఒత్తిడితో అనారోగ్యం పాలయ్యాను:
మేము తాతల కాలం నుంచి 20 ఏళ్ల పైనుంచి 2.20 ఎకరాల్లో సాగులో ఉన్నాం. గ్రామ కమిటీ సిఫార్సుతో పాటు అర్హుల జాబితాలో మా పేరు వచ్చింది. బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డులు సైతం సేకరించారు. ఏమైందో తెలియదు కానీ.. చివరి నిమిషంలో మాకు పట్టా రాలేదు. దీంతో ఒత్తిడి భరించలేక రక్తపోటు పెరిగి..మూతి వంకరపోయింది. చికిత్సకు రూ. 20వేల పైనే ఖర్చయింది. ఆ పొలమే మాకు జీవనాధారం..అధికారులు స్పందించి నాకు పట్టా అందించాలని కోరుతున్నా.బండావత్ నాగు, బండావత్ తండా, దామరచర్ల మండలం

2005 నుంచి సాగులో ఉన్నాం:
మా అమ్మనాన్నలు సేలి-దస్రుతో కలిపి మేము 2005 నుంచి మూడెకరాలు సాగు చేసుకుంటున్నాం. అటవీ అధికారులు, గ్రామ కమిటీ సర్వే చేసి..తాము అర్హులుగా నివేదిక ఇచ్చారు. ఆ నివేదికను తీసుకోవడంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తాత్సారం చేస్తున్నారు. దీంతో మాకు పట్టా మంజూరులో ఆలస్యమవుతోంది. తక్షణమే అధికారులు స్పందించి మాకు పట్టా మంజూరు చేయాలి.సపావట్ దాసు, జువ్విచెట్టు తండా, తిరుమలగిరి సాగర్ మండలం

## నాలుగేళ్లుగా.. ఎదురుచూపులేగా..!

సూర్యాపేట : గత పదేళ్లుగా ఆయకట్టుతో పాటు ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల బావులు, బోర్లతో వ్యవసాయానికి సాగునీరు అందిస్తున్నారు. 2001-02లో వచ్చిన కరవు తర్వాత ఆయకట్టులో 70 శాతం మంది రైతులు బోర్లు, బావులు తవ్వించారు. వీటికి మోటార్లు ఏర్పాటు చేసుకుని కొద్ది కమతంలో పంటలు పండిస్తున్నారు. ఒక వ్యవసాయ విద్యుత్తు సర్వీసు మంజూరు కావాలంటే ముగ్గురు లేదంటే నలుగురు రైతులు డీడీలు చెల్లించాలి. ఒక్కో డీడీ ప్రస్తుతం రూ. 5800లు (గతంలో రూ. 4960 ఉండేది) చెల్లించాలి. ఒక్క డీడీ చెల్లిస్తే ప్రభుత్వం ఒక్క డీడీకి రూ. 70 వేల రాయితీ ఇస్తుంది. ఇలా మూడు డీడీలకు రూ. 2,10,000 ప్రభుత్వం నుంచి రాయితీ రూపంలో విద్యుత్తు శాఖకు అందుతుంది. ఆ డబ్బుతో రైతులకు ఒక విద్యుత్తు నియంత్రిక, ఒక డీపీ స్తంభం, ఏబీ స్విచ్, ఎస్‌జీ ఫ్యూజు, దిమ్మె, కూలీల ఖర్చు, ఎర్త్ తదితర సామగ్రి సమకూర్చుతారు. నాలుగు డీడీలు చెల్లిస్తే నియంత్రికతో పాటు అదనంగా 5 స్తంభాల మేర లైను వస్తుంది. రైతులు ఎక్కువగా నాలుగు డీడీలు చెల్లిస్తుంటారు. ఏటేటా రైతుల అవసరాలు పెరుగుతుండటంతో తదనుగుణంగా సర్వీసులు మంజూరు ఇవ్వడం లేదు. కొంతమంది రైతులు నాలుగేళ్ల క్రితం డీడీలు చెల్లించి నేటికి సర్వీసు మంజూరు, లైన్ ఏర్పాటుకు ఎదురుచూస్తున్నారు.

సకాలంలో మంజూరు ఇస్తే..రైతులు డీడీలు చెల్లించిన వెంటనే మంజూరు ఇచ్చి నియంత్రిక ఏర్పాటు, లైన్లు వేయడం పూర్తి చేస్తే పెరిగిన భారం పడేది కాదు. ప్రభుత్వం జాప్యం చేయడంతో అది నాలుగేళ్ల తర్వాత రైతులపై పడుతుంది. సకాలంలో డీడీలు చెల్లించినా భారం పడటం అన్యాయ మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓఆర్‌స్మీ చెల్లించినా కొంతమ ందికి మంజూరు రావడం లేదు. గరిడేపల్లిలో కొంతమంది రైతులు రూ. 2.62 లక్షలు ఓఆర్‌స్మీ చెల్లించారు. అయినా పనులు చేయడానికి రెండు నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తుంది. ఇలా ఉమ్మడి జిల్లాలో పది వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

ఓఆర్‌స్మీ చెల్లించి రెండు నెలలుమేము కొంతమంది రైతులం కలిసి 2019 సెప్టెంబరు 24న ముగ్గురం ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు, నలుగురం మరో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏడు డీడీలు తీశాం. 2023 ఏప్రిల్‌లో రూ. 2.62 లక్షలు ఓఆర్‌స్మీ కట్టాలని అధికారులు చెప్పారు. యాసంగి పంట చేతికి రావడంతో అప్పులు పోగా మిగిలిన సొమ్మును వానాకాలం పెట్టుబడికి ఉంచుకుందామ నుకున్నా.. అందరు కరెంటు కోసం డబ్బులు కట్టాలంటే ఓఆర్‌స్మీ కింద ఏప్రిల్ 17న చెల్లించాం. నియంత్రిక, స్తంభాలు వేయండని అధికారులను అడిగితే టెండర్ పిలవాలని చెబుతున్నారు. స్మీజన్ వచ్చింది. నారుమడికైనా నీరు పెట్టుకుందామంటే మోటారుకు విద్యుత్తు లేదు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే లైను, నియంత్రిక ఏర్పాటు చేయండి.

బండ వెంకటరెడ్డి. గరిడేపల్లివారంలో టెండర్ పూర్తి చేస్తాం
ఓఆర్‌సీ ఎక్కువ ఉంటే టెండర్ పిలవాల్సి ఉంటుంది. టెండర్‌కు నోటీసు బోర్డుపై పెడుతున్నాం. వారంలో పూర్తి చేస్తాం. వెంటనే లైన్ వేయిస్తాం .వెంకటకృష్ణయ్య, డీఈ హుజూర్‌నగర్.

రైతులపై పెరిగిన భారంరైతులు చెల్లించిన డీడీలకు ప్రభుత్వం ఎప్పటి నుంచో రూ. 70 వేల రాయితీ ఇస్తుంది. 2016-17 సంవత్సరం నుంచి నియంత్రికలు, కరెంటు సామగ్రి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. 2018-19లో రూ. 75 వేలు ఉన్న 25 కేవీ విద్యుత్తు నియంత్రిక ప్రస్తుతం రూ. 1.20 లక్షలు అయింది. ప్రభుత్వం రాయితీ పెంచలేదు. కేవలం రూ. 70 వేలు ఇస్తుంది.

# పనితీరులో వెనుకబడి!

జనగామ : ప్రభుత్వ పాఠశాలల పనితీరును లెక్కిస్తూ పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ఫర్ డిస్ట్రిక్ట్ 2021-22(పీజీఐడీ)లో జిల్లాల వారీగా కేంద్ర ప్రభుత్వం గ్రేడ్‌లను ప్రకటించింది. ఇందులో ఉమ్మడి వరంగల్ పరిధిలోని జిల్లాలు నామమాత్రపు ఫలితాలే సాధించాయి. వరంగల్, హనుమకొండ మాత్రమే 'ఉత్తమ్'గా నిలిచాయి. మిగతా మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాలు ప్రచేష్ట-1తో సరిపెట్టుకున్నాయి.

ఇలా ఉంటే ఉత్తమ గ్రేడ్

హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ అభ్యసన్నోత ప్రాథమిక పాఠశాలలో 552 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ బాల, బాలికలకు ప్రత్యేక వసతులతో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. తరగతి గదుల్లో అధునాతన డ్యూయల్ డెస్క్‌లు సమకూర్చారు. డిజిటల్ బోధన, పిల్లలకు ఉపయుక్తమైన పుస్తకాలతో పాటు జనరల్ నాలెడ్జ్, కథలు, కంప్యూటర్ తదితర పుస్తకాలతో గ్రంథాలయం ఉన్నాయి. దాతల సాయంతో శుద్ధజలం పరికరం ఏర్పాటు చేశారు. అధునాతన వంటశాలను నిర్మించారు. పాఠశాల ఆవరణ అంతా పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంటోంది.

ఇలా అన్ని పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తే పనితీరు మెరుగుపడి జిల్లాలకు మంచి గ్రేడ్ వచ్చే అవకాశం ఉంది.

ఎలా లెక్కించారంటే.. పాఠశాలల సామర్థ్యాలను అంచనా వేయడానికి కేంద్ర విద్యాశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక నిపుణులు, ఏజెన్సీల ప్రతినిధుల బృందాల సభ్యులు దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించి వివరాలు తీసుకున్నారు. పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ)ను ఆరు ప్రామాణికాలతో పాటు 83 కోణాల్లో జిల్లాల



పనితీరును లెక్కించారు. గరిష్ఠంగా 600 మార్కులు కేటాయిస్తారు. 90 శాతానికి పైగా మార్కులు సాధించిన జిల్లాలకు దక్ష్, 81-90 శాతం మధ్య పొందిన వాటికి ఉత్కర్ష్, 71-80 శాతం మధ్య ఉంటే అతి ఉత్తమ్, 61-70 శాతం పొందిన వాటికి ఉత్తమ్, 51-60 శాతం మార్కులు దక్కిన వాటికి ప్రచేష్ట-1, 41-50 శాతం మధ్య ఉన్న వాటికి ప్రచేష్ట-2, 21-30 శాతం మార్కులు సాధించిన వాటికి ఆకాంక్షి-1, 11-20 శాతం మార్కులు వచ్చిన వాటికి ఆకాంక్షి-2, 10 శాతం ఉన్న వాటికి ఆకాంక్షి-3 గ్రేడ్లు కేటాయిస్తారు.

విద్యా ప్రమాణాలు పెంపొందిస్తాం..డా.ఎండీ.అబ్దుల్‌హై, జిల్లా విద్యాశాఖ అధికారి, హనుమకొండ

జాతీయ, అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు పెంచుకోవడానికి గ్రేడులు తోడ్పడతాయి. ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నామో తెలుసుకోవచ్చు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగుపరుచుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషి చేస్తాం.

# పట్టణాలకు వలస.. వసతులే సమస్య

జనగామ : పల్లెలు పట్టణాలవుతున్నాయి.. పంట పొలాలు కనుమరుగై ఆకాశ హర్మ్యాలు వెలుస్తున్నాయి. వీటన్నిటికీ కారణం జనాభా విపరీతంగా పెరుగుతుండటమే... ఉమ్మడి వరంగల్.. ఆరు జిల్లాలుగా విడిపోయిన తర్వాత ప్రతి చోట జనాభా క్రమంగా పెరిగిపోతోంది. వరంగల్ కార్పొరేషన్ సహా జిల్లా కేంద్రాలుగా మారిన పురపాలక సంఘాల్లోనూ, పురపాలికలుగా మారిన పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించు కుని ఉమ్మడి జిల్లా పట్టణాల్లో జనాభా పెరుగుదల కారణంగా వస్తున్న మార్పులు, కలుగుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై ప్రత్యేక కథనం. వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాటి వినియోగంతో వెలువడే కర్బన ఉద్గారాలతో కాలుష్యం పెరుగుతోంది. కొత్త కాలనీల్లో భవనాల నిర్మాణం వల్ల పచ్చదనం కోల్పోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది.

లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటల ఆక్రమణలతో ప్రణాళిక లేకుండా ఇబ్బడి ముబ్బడిగా భవన నిర్మాణాలు వెలుస్తుండటం వల్ల భారీ వర్షాలకు వరదలతో నీటమునుగుతున్నాయి. రెండేళ్లలో వరంగల్ నగరంలో భారీ వర్షాలకు అనేక కాలనీలు నీట మునిగాయి. జిల్లాల విస్తరణకు ముందు ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధి, సౌకర్యవంతమైన జీవనం కోరుతూ వరంగల్ నగరం బాట పట్టారు. కొత్త జిల్లాలుగా ఏర్పడిన మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లా కేంద్రాల్లోనూ పట్టణీకరణ వేగం పుంజుకుంటోంది. వరంగల్ నగరంలో ప్రతి రోజూ ఏదో విధంగా పని దొరుకుతుండడం, మెరుగైన విద్య, వైద్యసదుపాయాలు అందుబాటులోకి రావడం, వంటి కారణాలు అక్కడ పట్టణీకరణకు దారితీస్తోంది. కొత్తగా ఆవిర్భవించిన జిల్లాల్లోనూ ప్రభుత్వం వైద్య, విద్యా సదుపాయాలను మెరుగుపరుస్తుండడం, కొత్త కట్టడాల నిర్మాణం పెరుగుతుండడంతో వివిధ వర్గాలకు ఉపాధి లభిస్తోంది. దీంతో ఆయా జిల్లా కేంద్రాలుగా ఉన్న మున్సిపాలిటీల్లోనూ జనాభా పెరుగుదల కనిపిస్తోంది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లోనూ ఒత్తిడి పెరుగుతోంది. జిల్లాల్లో పారిశ్రామిక రంగం వృద్ధి చెందితే హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ లాంటి పెద్ద నగరాలకు ఉపాధి కోసం వెళ్లే వారి సంఖ్య తగ్గి ఇక్కడే జనాభా రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో ఈ పట్టణాల్లో వసతుల కల్పన సవాలుగా మారనుంది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా వసతుల కల్పనపై ప్రత్యేక చొరవ చూపిస్తేనే సమస్యలు తీరుతాయి.

ఇలా చేద్దాం పట్టణాల్లో శివారు కాలనీలపై అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించాలి. గ్రామాల్లో విద్య, వైద్యంతో ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గుతోంది. పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని మరింత సమర్థంగా నిర్వహించాలి. పట్టణాల్లో ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించాలి. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలి.

# నగరం నిద్రపోతున్న వేళ



ఖమ్మం: విచ్చలవిడి గంజాయి వినియోగం అనేక దుష్పరిణామాలకు దారి తీస్తోంది. ఖమ్మం నగరంలో గంజాయి మత్తులో ఆకతాయిలు నానా హంగామా సృష్టిస్తున్నారు. రాత్రిపూట ఇష్టారాజ్యంగా సంచరిస్తూ తారసపడిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. ఈక్రమంలో రైల్వే ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది.

రాత్రి 11 గంటలు దాటితే..

ఖమ్మం నగరంలో గంజాయి వినియోగం విపరీతంగా పెరిగింది. రాత్రి 11 గంటలు దాటితే అడ్డాల్లో ఆకతాయిలు గుంపులుగా సంచరిస్తున్నారు. గంజాయి, మద్యం తాగేందుకు ప్రధానంగా రైల్వేట్రాక్ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. మత్తులో రాత్రిపూట విధులు నిర్వర్తించే ఉద్యోగులు, బాటసారులపైనా దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల ఈ సంస్కృతి విచ్చలవిడిగా పెరిగింది. రామన్నపేట, దానవాయిగూడెం, రాపర్తినగర్ బ్రిడ్జి, సారథినగర్, గాంధీచౌక్, శ్రీనివాసనగర్, అగ్రహారం, ధంసలాపురం, పందిళ్లపల్లి రైల్వేట్రాక్‌ల వద్ద ఆకతాయిలు వీరంగం సృష్టిస్తున్నారు.

మూడేళ్లుగా బిక్కుబిక్కుమంటూ..

సుమారు మూడేళ్లుగా భయానక పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. ట్రాక్‌మెన్లు, సిగ్నలింగ్, ఆపరేటింగ్ సిబ్బంది రాత్రిపూట రైల్వేట్రాక్‌ల పనితీరు, భద్రతను పర్యవేక్షిస్తుంటారు. ఈక్రమంలో మత్తులో ఉన్న ఆకతాయిలు మారణాయుధాలతో వారిపై దాడులకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. జేబుల్లోని పర్సులు, సెల్‌ఫోన్లు లాక్కుంటున్నారు. రాత్రిపూట విధులంటేనే రైల్వే సిబ్బంది హడలిపోతున్నారు. ఉద్యోగులపైనే కాదు రైళ్లపైనా ఆకతాయిలు దాడులకు తెగబడుతున్నారు. గతంలో దానవాయిగూడెం, రామన్నపేట, ప్రకాశ్‌నగర్ వంతెన సమీపంలో వివిధ రైళ్లపై రాళ్లు విసిరారు.ఖమ్మం నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అల్లరిమూకల ఆగడాలు పెచ్చుమీరుతున్నా పోలీసు, జీఆర్పీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఖమ్మం-3 పట్టణ ప్రాంతంలో మూడు రోజుల క్రితం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రైల్వేట్రాక్‌పై ట్రాక్‌మెన్ రిషీశ్వర్ పెట్రోలింగ్ చేస్తున్నారు. గంజాయి మత్తులో ఓ యువకుడు కత్తితో దాడికి యత్నించాడు. అతడి జేబులోని డబ్బు, సెల్‌ఫోన్ లాక్కోవాలని భావించాడు. ట్రాక్‌మెన్ ప్రతిఘటించి అక్కడి నుంచి బయటపడ్డారు. మరుసటి రోజు సహోద్యోగులతో కలిసి జీఆర్పీ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

ఖమ్మంలో గత నెలలో నర్తకి థియేటర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై సిగ్నల్ వ్యవస్థను సరిచేస్తున్న క్రమంలో సీనియర్ సిగ్నల్ మెయింటనర్, సిగ్నల్ అసిస్టెంట్‌ను కొందరు ఆకతాయిలు భయభ్రాంతులకు గురిచేశారు. దాడి చేసేందుకూ యత్నించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకోవటంతో ఆకతాయిలు పరారయ్యారు.

రైల్వేట్రాక్‌లపై రాత్రిపూట విధులు నిర్వర్తించటం ఇబ్బందిగా మారింది. గంజాయి, మద్యం మత్తులో ఆకతాయిలు మారణాయుధాలు, రాళ్లతో దాడులకు పాల్పడుతున్నారు. రైల్వే ఉద్యోగులకు భద్రత కల్పించాలి.

కె.అంజయ్య, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుడు, ఖమ్మం

రైల్వే పరిసరాల్లో ఆకతాయిలు సంచరించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇటీవల రైల్వేట్రాక్‌పై విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగిపై ఒక యువకుడు దాడిచేశాడు. నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నాం. రైల్వే ట్రాక్‌లపై పకడ్బందీగా గస్తీ ఏర్పాటు చేస్తాం.అంతోటి వెంకటేశ్వరరావు, సీఐ, జీఆర్పీ, ఖమ్మం

# ప్రభుత్వ విద్యాలయాల్లో పరిశుభ్రతకు చోటేదీ?



కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పలు సంస్కరణలు చేపడుతున్నారు. వసతుల కల్పనపై బాగా దృష్టిసారించారు. కానీ పారిశుద్ధ్య చర్యల విషయంలో మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. ఓ వైపు వర్షాలు ప్రారంభమయ్యాయి. సీజనల్ వ్యాధుల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈ తరుణంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వ విద్యాలయాల్లోని స్కావెంజర్లు, కాపలాదారులను గతంలో తొలగించడం సమస్యాత్మకంగా మారింది. విద్యాలయాలకు సమకూర్చే విలువైన సామగ్రికీ రక్షణ కొరవడుతోంది. స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించాలని ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో తూతూమంత్రంగా అమలవుతున్నాయి.ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 304 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కేవలం పాఠశాల ఆవరణను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లను విస్మరిస్తున్నారు.

2015-16 విద్యా సంవత్సరంలో..

పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు స్కావెంజర్లు, వాచ్‌మెన్లు, అటెండర్లను నియమించారు. ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చెల్లించేవారు. 2020 మార్చి తర్వాత వారందరినీ తొలగించారు. వీరు చేసే పనులను ప్రస్తుతం స్థానిక సంస్థల కార్మికులతో చేయించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ వారు పాఠశాలల ఆవరణలు, మైదానాలు అడపాదడపా శుభ్రం చేసి వెళ్తున్నారు. తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లను పట్టించుకోకపోవటంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. 'మన ఊరు - మన బడి' పథకానికి ఎంపికైన పాఠశాలల్లో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. కానీ మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రం చేసే వారే లేరు. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు స్థానిక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తేనే సిబ్బందిని పంపిస్తున్నారు. స్కావెంజర్ల నియామకమే సమస్యకు పరిష్కారంగా కనిపిస్తోంది.

సమస్యను కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తా

విద్యాలయాల్లోని పారిశుద్ధ్య పనులను స్థానిక పంచాయతీ కార్మికులతో నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని మరోసారి ఉభయ జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తా. విద్యాలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. విలువైన సామగ్రి ఉన్నచోట సీసీ కెమెరాల ఏర్పాటుపై నివేదిక పంపిస్తాం.

సోమశేఖర్‌శర్మ, డీఈఓ

# నిధులు చాలక.. పనులు సాగక..!

ఖమ్మం: గోదావరి జలాలను బీడు భూములకు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు భూసేకరణకు నిధుల కొరత ఏర్పడింది. ఆరేళ్లుగా దశల వారీగా కొద్దికొద్దిగా నిధులు ఇస్తున్నా పూర్తిస్థాయిలో భూసేకరణ పూర్తి కానందున ప్రధాన కాల్వ తవ్వకంలో జాప్యం నెలకొంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టులో ప్రధానమైన పాలేరు లింకు కాల్వను ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తవ్వాల్సి ఉంది. ఈ ప్రధాన కాల్వ తవ్వకం పనులు నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. ఇప్పటి వరకు 13వ ప్యాకేజీ టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. 14వ ప్యాకేజీలో నిర్మాణ పనులే చేపట్టలేదు. 15, 16 ప్యాకేజీల్లో అక్కడక్కడా పనులు చేపడుతున్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లింపులు జరగనందున గుత్తేదారులు కాల్వ తవ్వకం పనులు నిలిపేశారు. అక్విడెక్ట్‌లు, సిమెంట్ కాంక్రీట్ పనులు మాత్రం కొనసాగిస్తున్నారు.13వ ప్యాకేజీలో..ప్రైవేటు భూమి 34 ఎకరాలు సేకరించాలి. మిగతాది ప్రభుత్వ భూమి. 14, 15, 16 ప్యాకేజీల్లో 1,980 ఎకరాలు సేకరించి అవార్డు పాస్ చేయగా అందులో 832.48 ఎకరాలకు మాత్రమే రైతులకు డబ్బు చెల్లించారు. 14వ ప్యాకేజీలో డోర్నకల్ వద్ద రెండు రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద అక్విడెక్ట్‌ల నిర్మాణ పనులకు అవసరమైన భూమిని సేకరించి బాధిత రైతులకు డబ్బు చెల్లించారు. మిగతా రైతులు తాము కోల్పోయిన భూములకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. భూముల విలువ పెరుగుతున్నందున ఆందోళన చెందుతున్నారు. సేకరించిన వెంటనే రైతులకు పరిహారం చెల్లించి ఉంటే తమకు అనువైన ప్రాంతంలో కొనుగోలు చేసుకునేవారు. ప్రస్తుతం భూమి విలువ విపరీతంగా పెరగటంతో, తాము కోల్పోయిన భూమికి పాత ధర తక్కువగా నిర్ణయించారని అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సీతారామ ప్రాజెక్టులో కీలకమైన 14వ ప్యాకేజీలో భూసేకరణకు నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు విడుదల కాగానే రైతులకు పరిహారం చెల్లిస్తాం. సుమారు రూ.150 కోట్లు విడుదల చేస్తే భూసేకరణ ప్రక్రియ పూర్తవుతుంది. పనులు వేగవంతం చేయవచ్చు.శంకర్‌నాయక్, సీఈ, ఖమ్మం, జలవనరుల శాఖ

# చిన్న రైతుకు సాగు బాసట

పెద్దపల్లి : చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. జాతీయ ఉపాధిహామీ పథకంలో భూముల అభివృద్ధి, సాగునీటి వసతి, చేపల చెరువుల పెంపకం, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణం వంటి వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. తాజాగా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు నిధులు కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల వరకు నిర్వహణ కోసం పూర్తి రాయితీపై రూ.2,50,272 అందిస్తారు. అరుదైన పంట కావడంతో సాగుపై అవగాహన కల్పించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సిద్ధమవుతోంది. ఇప్పుడిప్పుడే జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తరిస్తోంది. లాభాలు వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాయితీ అవకాశం ఉండటంతో విస్తీర్ణం పెరగనుందని భావిస్తున్నారు.

ఔషధ గుణాలు

డ్రాగన్ ఫ్రూట్ పండ్లు ఎరుపు, గులాబీ రంగుల్లో ఉంటాయి. ఒక్కసారి మొక్కలు నాటితే దాదాపు 40 ఏళ్ల పాటు దిగుబడి వస్తుందని అంచనా. నాటిన తర్వాత 18 నెలలకే పంట చేతికొస్తుంది. అనంతరం ఏడాదికొకసారి దిగుబడి వస్తుంది. ఒక్కో పండు బరువు 200 గ్రాముల బరువుతో విలక్షణమైన ఔషధ గుణాలు కలిగి ఉంటుంది. శరీరంలో రక్త కణాలు, పోషకాలు పెరుగుతుండటంతో వైద్యులు కూడా ఈ పండ్లు తినాలని సూచిస్తున్నారు. అన్ని రోగాలకు సంబంధించి ఔషధ గుణాలుండటంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పండులోని నల్లని గింజలను ఆయుర్వేద మందులుగా వాడుతున్నారు.

అర్హులు ఎవరు..?

ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. బోరు లేదా బావి నీటి వసతితో పాటు అయిదెకరాల లోపు భూమి ఉండాలి. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు గ్రామంలో ఎంత మంది రైతులు ముందుకొచ్చినా నిబంధనలకు అనుగుణంగా అందరికీ అనుమతినిస్తారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకంతో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సందేహాల నివృత్తికి అధికారులను సంప్రదించవచ్చు.

అర ఎకరంలో 900 మొక్కలు

డ్రాగన్‌ఫ్రూట్ సాగు కోసం మొక్కల కొనుగోలు నుంచి కూలీలు, సామగ్రి ఖర్చులకు నిధులు మంజూరు చేస్తున్నారు. అర ఎకరంలో సాగుకు మూడేళ్ల పాటు విడతల వారీగా రూ.2.50 లక్షలు విడుదలవుతాయి. మొక్క కొనుగోలు, రవాణా కోసం రూ.40 చొప్పున చెల్లిస్తారు. మూడు మీటర్ల పొడవు, మూడు మీటర్ల వెడల్పులో ఒక్కో మొక్క నాటాలి. అర ఎకరంలో 900 మొక్కలు నాటనున్నారు. స్తంభాలకు నలువైపులా నాలుగు మొక్కలు నాటాలి. కూలీలు, మొక్కలు, స్తంభాల కొనుగోలు, రవాణా తదితర ఖర్చులకు రాయితీ కల్పించారు. రాష్ట్రంలో ములుగు, సిద్దిపేటల్లో నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు.

విడతల వారీగా నిధులు

మొదటి ఏడాది: రూ.1,80,972

రెండు, మూడో సంవత్సరాల్లో: రూ.34,650 చొప్పున.. మొత్తం: రూ.2,50,272రైతులకు అవగాహన కల్పిస్తాం-శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

ఉపాధిహామీ పథకంలో కొత్తగా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రాయితీ అవకాశం ఉంది. సొంత భూమి, పట్టాదారు పాసుపుస్తకం, జాబ్‌కార్డు కలిగి ఉండటం తప్పనిసరి. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల సమన్వయంతో పథకాన్ని అమలు చేస్తాం. సాగు విస్తీర్ణం పెంపునకు రైతులకు అవగాహన కల్పిస్తాం. రైతులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తుదారుల అర్హతను బట్టి మంజూరు చేస్తాం.

# లెక్క తేలని మట్టి

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ఎర్ర మట్టి మాయమవుతోంది. కూడళ్ల సుందరీకరణ సమయంలో రూ.లక్షలు ఖర్చు చేసి పోయిస్తున్న మట్టి తిరిగి నిల్వ చేసుకోవాల్సి ఉండగా, అదేదీ పట్టకుండా ఉండటంతో కొందరు గుత్తేదారులు దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇందిరాచౌక్, తెలంగాణ చౌరస్తా కూడలి నుంచి సేకరించిన మట్టిని ట్రాక్టర్ల కొద్ది అమ్ముకోగా, ఫిర్యాదులు రావడంతో కొద్దిగా అంబేడ్కర్‌నగర్ రిజర్వాయర్ ప్రాంతంలో పోశారు. ఇంకొద్దిగా బైపాసు జంక్షన్‌లో పోశారు. ప్రస్తుతం అది కూడా ఏర్పడకు ండా తరలించుకొని పోతుండటం వివాదాస్పదంగా మారుతోంది.

అంతా గోల్‌మాల్..

కూడళ్ల నిర్మాణంలో, కుదింపు సమయంలో అందుల్లోని మట్టి ఎక్కడికీ దేనికోసం తరలిస్తున్నారనే విషయం తెలియకుండా మారుతోంది. ఆ సమయంలో ఇంజినీరింగ్ అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎవరు కూడా అక్కడ ఉండరు. ఎన్ని ట్రిప్పులు తీసుకెళ్తున్నారో ఎవరికీ అర్థం కాకుండా ఉంటుంది. టెండర్ నిబంధనల ప్రకారం ఎర్త్ వర్క్ కార్టింగ్(రవాణా) ఛార్జీలు లెక్కిస్తారు. మట్టి తరలించేందుకు ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. నిర్మాణ వ్యర్థాలను అధికారులు గుర్తించిన ప్రదేశాల్లో పోయించుకో వచ్చు. అలా నగరంలో జరగడం లేదు. గుత్తేదారులే తీసుకెళ్లి అమ్ముకోవడం లేదంటే ఓ చోట నిల్వ చేసి తిరిగి ఇతర కూడళ్ల పనుల సమయంలో తీసుకొచ్చి పోస్తున్నారనే విమర్శలున్నాయి. అంబేడ్కర్‌నగర్ రిజర్వాయర్ వద్ద ఎర్రమట్టిని 9 నెలల కిందట నిల్వ చేశారు. సోమవారం జేసీబీ ద్వారా తవ్వుతూ.. ప్రభుత్వాసుపత్రిలో పచ్చదనం కోసం తీసుకెళ్లారు.

నోటీసులకే పరిమితం

తెలంగాణ జంక్షన్ అభివృద్ధి సమయంలో గుత్తేదారు నాణ్యమైన ఎర్రమట్టిని గ్రామీణ ప్రాంతాలకు, నగరంలో ట్రాక్టర్ల ట్రిప్పుల చొప్పున అమ్ముకున్నారు. కొందరు కార్పొరేటర్లు డివిజన్లలో మొక్కల కోసం మట్టి కావాలన్నా పోయలేదు. ఆ విషయాన్ని అప్పట్లో బహిర్గతం చేశారు. రూ.3 వేల చొప్పున ట్రాక్టర్ పోయగా సుమారు వంద ట్రిప్పుల వరకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. వెంటనే నిలిపివేసి అంబేడ్కర్‌నగర్ ట్యాంకులో, ఇతర రిజర్వాయర్లలో పోయించారు. స్మార్ట్‌సిటీ ద్వారా సదరు గుత్తేదారుకు నోటీసు జారీ చేశారు. ఆ సమయంలో రికవరీ చేస్తామని చెప్పిన ఇంజినీరింగ్ అధికారులు, ఎంతమేర చేశారనే విషయాన్ని మాత్రం ఇప్పటికీ లెక్క తేల్చకపోగా, ఆ అంశాన్ని గోప్యంగా ఉంచారు.

బిల్లు రికార్డు చేయలేదు- మసూద్‌అలీ, డీఈఈ, నగరపాలిక

అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లు రికార్డు చేయలేదు. ఆ సమయంలో మట్టి విలువ ఎంతమేర తేలితే అంతమేరకు తొలగించుకొని బిల్లు రికార్డు చేస్తాం. ప్రభుత్వ యూనాని ఆసుపత్రిలో మొక్కల కోసమంటే ఒకటెండ్రు ట్రాక్టర్లు అంబేడ్కర్‌నగర్ ట్యాంకు వద్ద నుంచి తీసుకెళ్లారు.

# సొంతింటి కల.. సాకారమెప్పుడో?

మంచిర్యాల: రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టి అయిదేళ్లవుతున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉట్నూరులోని ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం ద్వారా ఏజెన్సీలోని ఇంద్రవెల్లి, ఉట్నూరు, నార్నూరు, గాదిగూడ మండలాలకు చెందిన పేదల కోసం 177 ఇళ్లను కేటాయించారు. మూడు నెలల కిందట ఇళ్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం పేదల నుంచి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తులు సైతం స్వీకరించింది. కానీ ఏజెన్సీలో మాత్రం ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఏజెన్సీలో 177 ఇళ్ల నిర్మాణాలు అయిదేళ్ల కిందట చేపట్టారు. గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. గతంలో జిల్లా పాలనాధికారులుగా విధులు నిర్వహించిన వారితోపాటు ఐటీడీఏ పీఓలు సైతం రెండు పడక గదుల నిర్మాణాలపై దృష్టి సారించి పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. పాలనాధికారులు, పీఓల ఆదేశాల మేరకు ఉట్నూరు మండల కేంద్రంలో 80 రెండు పడక



గదుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ ఇళ్లతో పాటు నార్నూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో 12 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. మిగతా 85 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. రోడ్డు, విద్యుత్తు సౌకర్యం కల్పించాల్సి ఉన్నా అవేమీ లేవు.

అడుగు భాగంలో గుంతలు, ఇళ్లకు పగుళ్లు

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తయిన చోట్ల పనుల డొల్లతనం బయటపడుతోంది. ఇళ్లలో అడుగు భాగం ఫ్లోరింగ్ పగిలి గుంతలు పడుతున్నాయి. వర్షం నీరు నిలుస్తోంది. ప్రారంభానికి ముందే ఇలా ఉంటే.. అందులో ఎలా ఉండేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మరోపక్క నిర్మాణం సమయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల గోడలకు పగుళ్లు వచ్చాయి.

త్వరలో పూర్తి చేయిస్తాం

ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగానికి ప్రభుత్వం కేటాయించిన రెండు పడక గదుల నిర్మాణం పనులు త్వరలో పూర్తి చేయించేందుకు గుత్తేదారులకు తాఖీదులు జారీ చేస్తాం. ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగానికి కేటాయించిన 177 ఇళ్లలో 92 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగతావి ఆయా దశల్లో ఉన్నాయి. ఇంద్రవెల్లిలో నిర్మించే 35 ఇళ్లలో పూర్తయిన వాటిని పరిశీలిస్తాం. గుంతలు పడిన ఇళ్లను గుత్తేదార్లతో బాగు చేయిస్తాం. – రాఠోడ్ భీంరావు, ఈఈ, ఐటీడీఏ ఉట్నూరు

# గురుకులం.. వేదనాభరితం!

ఆసిఫాబాద్ : పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఏర్పాటు చేసిన గురుకులాల్లో సిబ్బంది, అధ్యాపకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. అంతటా అటకెక్కిన ఆహారపట్టిక, ఇరుకిరుకు గదులు, అధ్వాన పరిసరాలు కనిపిస్తున్నాయి. బాలికల గురుకులాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. కళాశాలల్లో చోరీలు జరిగినా తూతూ మంత్రంగా విచారణ చేసి వదిలేస్తున్నారు. బాలికల వసతిగృహాలు, మహిళల కళాశాలలో అనుమతిలేదని ఎవరినీ లోనికి రానీయడం లేదు. దీంతో అక్కడ అవస్థలు బయటకు రావడం లేదు.జిల్లాలో ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకులాలు 12 ఉన్నాయి. ఇందులో 7వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆసిఫాబాద్ పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనడానికి మూడు రోజుల క్రితం మరణించిన డిగ్రీ విద్యార్థి ఉదంతమే నిదర్శనం. వివరాలు తెలుసుకోవడానికి వెళ్లిన పాత్రికేయులతోపాటు, ప్రజా సంఘాల నేతలను కళాశాలలోకి అనుమతించడం లేదు. ఈ కళాశాలపై అనేక ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పక్షం రోజుల క్రితం అయిదుగురు డిగ్రీ విద్యార్థినుల పెట్టెల(సూట్‌కేస్)ను కళాశాలలో సిబ్బంది దొంగతనం చేశారు. అనంతరం విచారణ చేసిన అధికారులు ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఫిర్యాదు చేసిన విద్యార్థులనే భయపెట్టాలని చూసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.

అటకెక్కిన ఆహారపట్టిక...విద్యార్థులకు ప్రతి ఆదివారం కోడిమాంసం, మేక మాంసం అందించాలి. ఇందులో సగం సరకులు సంబంధిత సిబ్బంది దొంగచాటుగా ఇంటికి తీసుకెళ్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. విద్యార్థులు ఆహారం తినడానికి ఏడుస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వాస్తవంగా డిగ్రీ కళాశాలల్లో అనుభవం ఉన్న అధ్యాపకులను ప్రిన్సిపల్‌గా నియమించాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం డిగ్రీ లెక్చరర్‌కే తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. వీరు సైతం ఆరునెలలు మాత్రమే ఉండాలి. అందుకు విరుద్ధంగా సంవత్సరాల తరబడి కొనసాగుతున్నారు. మరోవైపు కొందరు అధ్యాపకులు సైతం నిత్యం విధులకు రాకుండా, మంచిర్యాల, కాగజ్‌నగర్ నుంచి ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపుగా వస్తున్నారనే విమర్శలున్నాయి.

వాటాలు ఇవ్వాల్సిందే...గురుకులం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. నెలనెలా రూ.2.16 లక్షలు ప్రభుత్వ ఈ భవనం కోసం అద్దె చెల్లిస్తుంది. సంవత్సరానికి రూ.25.92 లక్షల అద్దె చెల్లిస్తున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి రూ.కోటి వరకు చెల్లించారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్న జిల్లా కేంద్రంలో ఈ అద్దె డబ్బులతోనే ఎన్నడో భవనం పూర్తయ్యేది. అద్దెలో భవన నిర్వహణ ఖర్చులకని రూ.60 వేలు ప్రతినెలా యజమాని నుంచి కళాశాల సిబ్బంది తీసుకుంటున్నారు. ఇందులో రూ.30 వేల ప్రతినెలా పక్కదారి పడుతున్నట్లుగా ఆరోపణలున్నాయి.

పాఠం, పడక ఒకే గదిలో..జిల్లా కేంద్రంలోని బీసీ గురుకులంలో 485 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ఆరు గదులు .. అవీ చిన్నగా ఉన్నాయి. పాఠాలు వింటున్న చోటే పడుకోవాల్సిన పరిస్థితి. భవనం వెనకాల మురికి, చెత్త పేరుకుపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయాయి. ఈ భవనానికి సైతం ప్రతినెలా రూ.1.20 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ఆర్వోప్లాంటు లేకపోవడంతో బయటి నుంచి తాగునీటిని తెప్పిస్తున్నారు.

# అప్రమత్తతే రక్ష.. పడాలి శిక్ష



మంచిర్యాల: బాలికను అపహరించి, అత్యాచారం చేసిన ఓ నిందితుడికి గత నెల 25న ఆదిలాబాద్ పోక్సో న్యాయస్థానం పది సంవత్సరాల జైలుశిక్ష విధించింది.నిర్మల్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి మాయమాటలు చెప్పి ఓ బాలికను హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం బయటికి పొక్కడంతో బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.ఎన్ని చట్టాలు తెచ్చినా.. బాలికలపై అత్యాచారాలు, అత్యాచార యత్నాలు ఆగడం లేదు. ఇలాంటి అఘాయిత్యాల నివారణకు పోక్సో చట్టం తెచ్చినా కామాంధుల తీరు మారడం లేదు. ఏటా ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా సగటును మూడు రోజులకు ఒక కేసు చొప్పున వందకు పైగా పోక్సో కేసులు నమోదవుతూనే ఉన్నాయి. పోలీసులు రక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా అప్రమత్తమైతేనే ఇలాంటి ఘటనలు అరికట్టగలుగుతాం..బాలికలకు భద్రత కల్పించగలుగుతాం.

అఘాయిత్యాలకు దారితీస్తున్న పరిస్థితులు

ఆన్‌లైన్ పాఠాల నేపథ్యంలో చాలామంది విద్యార్థినుల వద్ద చరవాణులు తప్పనిసరి అయ్యాయి. ఆకతాయిలు వారి నంబర్లు సంపాదించి మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో లొంగదీసుకుంటున్నారు.ఉమ్మడి జిల్లాలో వలస కార్మికులు అధికం. వారు పిల్లలను వృద్ధులైన తల్లిదండ్రులకు అప్పగించి వెళ్లిపోతున్నారు. ఇలాంటి కుటుంబాల్లో బాలికలకు రక్షణ కరవవుతోంది. చాలా గ్రామాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదు. దీంతో రోడ్డుపై నడుస్తూ వెళ్లే క్రమంలో వాహనదారుల సాయం అడుగుతుండటంతో మాయమాటలు చెప్పి బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. చాలా గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలే ఉన్నాయి. ఉన్నత విద్య కోసం విద్యార్థినులు దగ్గరలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఎక్కువ మంది విద్యార్థినులు నడుచుకుంటూ, ఆటోలలో వెళ్లాల్సిన పరిస్థితి. దీన్ని కామాంధులు అవకాశంగా తీసుకుంటున్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. కౌమార దశలో వచ్చే శారీరక, మానసిక మార్పులను విద్యార్థినులకు మహిళా ఉపాధ్యాయులు వివరిస్తూ యువకుల మాయమాటలకు లొంగకుండా జాగ్రత్తలు చెప్పాలి. షీ టీంలు గ్రామాలను తరచూ సందర్శించాలి. బాలికలతో ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే తమకు ఫిర్యాదు చేసేలా పాఠశాలల్లో అవగాహన కల్పించాలి. గ్రామాలు, పట్టణాల్లోని యువకులతో సమావేశాలు నిర్వహించి బాలికలు, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చట్టాలు ఎంత కఠినంగా ఉన్నాయో వివరించాలి. తల్లిదండ్రులు, మహిళా ఉపాధ్యాయులు విద్యార్థినులు తమ భావాలను, స్వేచ్ఛగా పంచుకునేలా తరచూ మాట్లాడుతుండాలి.

బాలల సంరక్షణకు ప్రత్యేక యాప్..

ఈ ఘటనలపై ఫిర్యాదుకు వెనుకాడుతుండడంతో నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారు. చాలా మంది భయపడి ఫిర్యాదులు చేయడం లేదు. కొందరు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేసినా నేరం చేసిన వారి నుంచి వేధింపులకు గురవుతున్నారు. ఇలాంటి వారికి న్యాయం చేయడంతో పాటు నేరగాళ్లను శిక్షించడానికి, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం పోక్సో ఈ-బాక్స్ పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. వందశాతం పారదర్శకతతో విచారణ జరిపి పోలీసుల సహకారంతో కేసును నమోదు చేస్తారు.

ఫిర్యాదు ఇలా...గూగుల్ ప్లే స్టోర్‌లో (పోక్సో ఈ బాక్స్) అని టైప్ చేస్తే యాప్ కనిపిస్తుంది. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకొని తెరవాలి. ఫిర్యాదు చేయాలంటే వృత్తాకారంలో ఉన్న బాక్స్‌ను క్లిక్ చేయాలి. సాధారణంగా చిన్నారులకు ఎదురయ్యే ఆరు రకాల హింసలకు సంబంధించిన చిత్రాలు కనిపిస్తాయి. వారిపై జరిగిన అఘాయిత్యం, జరిగేందుకు ఆస్కారమున్న ప్రాంతాలు, ఆటస్థలం, దుకాణం, రహదారి మీద, పాఠశాల లేదా వాహనాల్లో, బహిరంగ ప్రదేశాల్లో బాలికలతో అనుచిత ప్రవర్తన, శరీర భాగాలను చిత్రాల రూపంలో పెట్టారు. హింసా స్వభావాన్ని గమనించి ఆ చిత్రంపై క్లిక్ చేయాలి. అనంతరం ఫిర్యాదు పత్రంలో బాధితులు, జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలను పత్రంలో పొందుపర్చి సమర్పించాలి.

పోక్సో కేసు నమోదు చేసేది ఈ కింది ఘటనల్లోనే.. బాలికలకు వేధింపులు అత్యాచారం ఆత్మహత్య చేసుకోవడానికి ప్రేరేపించడం హత్య చేయడం హత్యాయత్నం అపహరణ కేసు తీవ్రతను బట్టి 10 ఏళ్ల నుంచి 18 సంవత్సరాల వరకు జైలు శిక్ష, వీటితో పాటు జరిమానా ఉంటుంది.

# పాత దారి.. నరకప్రాయంగా మారి



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పల్లి కాలనీ వద్ద పరిస్థితి ఇది. ఎడమ వైపున మాత్రమే విస్తరణ పనులు పూర్తయ్యాయి. కొత్త బీటీ రోడ్డు నిర్మించారు. కుడివైపున మాత్రం పనులకు ఆటంకం ఏర్పడింది. ఇక్కడ నివాసాలుండేవారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపించి వెడల్పు చేయాలని ఆదేశాలు వచ్చినా అడుగు ముందుకు పడడం లేదు.జిల్లా కేంద్రంలో పాత జాతీయ రహదారి విస్తరణ పనులు పలు చోట్ల మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. పట్టణంలోని దస్నాపూర్ వంతెన నుంచి కుమురంభీం, ఎన్టీఆర్‌కూడలి, బస్టాండ్, పంజాబ్‌చౌరస్తా(కిసాన్‌చౌక్), తిర్పల్లి కాలనీ మీదుగా సిమెంటు పరిశ్రమ క్రాస్‌రోడ్డు వరకు మొత్తం 4.65 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ.44 కోట్లు కేటాయించారు. నాలుగు వరుసల దారిని ఆరు వరుసలుగా మార్చాలి. ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణంతోపాటు మధ్యలో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, విద్యుత్తు స్తంభాలు తొలగించి టవర్ల నిర్మాణ పనులు చేయాలి.

మూడున్నరేళ్లుగా ముడిపడని పనులు..ఈ విస్తరణ పనులు 12.12.2018 నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే మూడున్నరేళ్లకుపైగానే కావొస్తున్నా పూర్తికాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలుచోట్ల నిర్మాణాలు ఆటంకాలు రావడంతో అవి పుర అధికారులు తొలగించి ఇస్తే తాము నిర్మాణ పనులు చేపడతామని రోడ్డు భవనాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పుర అధికారులు న్యాయస్థానాన్ని ముందుగానే ఆశ్రయిస్తే ఇతరులకు కోర్టుకు వెళ్లేందుకు అవకాశం ఉండేది కాదు. కొన్నిచోట్ల పెద్ద భవనాలు ఉండడంతో వారి మెప్పు కోసమే అప్పటి పుర అధికారులు ముందుగా కోర్టుకు వెళ్లలేదనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

పలుచోట్ల ఆటంకాలు తిర్పల్లి కాలనీలో దాదాపు 600 మీటర్ల పొడవునా ఓ పక్క విస్తరణ పనులు ఆగిపోయాయి. ఇక్కడ మురుగుకాలువ నిర్మాణం సైతం చేపట్టలేని పరిస్థితి. దశాబ్దాలుగా నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయం చూపించడం లేదు. ఖుర్షాపూర్ కాలనీ వద్ద పలుచోట్ల దుకాణాలను కూల్చివేయకుండానే మురుగుకాలువ నిర్మించారు. దీంతో ఇక్కడ దారి చిన్నగా మారింది. కుమురం భీం కూడలికి దగ్గరిలోనూ ఓవైపున మురుగుకాలువ అర్ధంతరంగా నిలిపివేశారు. కొన్ని ఇళ్ల తర్వాత మళ్లీ నిర్మించారు. ఈ విషయమై రోడ్లు భవనాల శాఖ ఈఈ నర్సయ్యను సంప్రదించగా కొన్నిచోట్ల యజమానులు కోర్టుకు వెళ్లడంతోనే పనులు ఆగాయి. ఇదంతా పురపాలక అధికారులు చూడాలి. వారు ఎక్కడా అడ్డంకులు లేకుండానే స్థలమిస్తేనే మేం విస్తరణ పనులు చేపడతాం. ఇందులో మా తప్పేమీ లేదు. పట్టణంలోని విద్యానగర్ కాలనీ మలుపు వద్ద నీరు నిలిచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం పక్క నుంచి బస్టాండ్ మీదుగా ఇక్కడి వరకు మురుగు కాలువ నిర్మించి వదిలేశారు. ముందు ఈద్గా మైదానం ఉండడంతో మురుగుకాలువ పనులు అక్కడే ఆపేశారు. వర్షం పడినప్పుడల్లా నీరు అక్కడే నిలిచిపోవడంతో స్థానికులు దోమలతో ఇక్కట్లు పడుతున్నారు.

# ఆశలకు పగుళ్లు..!

మంచిర్యాల: కడెం జలాశయం నుంచి నీటి విడుదల ఆలస్యమవుతుందని భావించిన అనేక మంది రైతులు విద్యుత్తు మోటార్ల ఆధారంగా వరి సాగు చేశారు. అయితే విద్యుత్తు లోఓల్టేజీ కారణంగా మోటార్లు నడవడం లేదు. దీంతో వేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉండగా.. మరికొన్ని చోట్ల మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జన్నారం మండలంలో ఈ ఏడాది వానకాలం పంట కింద 18,520 ఎకరాల్లో వరిసాగు చేశారు. సుమారు 8 వేల ఎకరాల వరకు విద్యుత్తు మోటార్ల ఆధారంగానే నాట్లు వేశారు. మొక్కలు ఎదుగుతున్న దశలోనే విద్యుత్తు అంతరాయం, లోఓల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోతున్నాయి. ఇటీవల దండేపల్లి మండలం మాకుల పేట వద్ద అక్కడి రైతులు ధర్నా సైతం చేశారు. ఎండలు అధికంగా ఉండడంతో వరికి సరైనా సమయంలో నీరు అందకపోవడం వల్ల దిగుబడి రావడం కష్టంగానే ఉందని పలువురు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్తు సమస్యలను పరిష్కరించే సిబ్బంది బదిలీపై వెళ్లడం, ఇంకా కొత్తవారిని నియమించక పోవడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. మండలంలో తపాల్‌పూర్, జన్నారం, కవ్వాల్, కలమడుగు గ్రామాల్లో ఉప విద్యుత్తు కేంద్రాలు ఉన్నాయి. లైన్‌మెన్, లైన్‌ఇన్‌స్పెక్టర్‌తో పాటు మండలానికి పెద్ద దిక్కుగా ఉన్న ఏఈ సైతం బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతం నాలుగు ఉప విద్యుత్తు కేంద్రాలు ఒక సబ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. 'ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలం వద్దనే ఉండాల్సి వస్తుంది...'అని చింతగూడ రైతు శేఖర్ అన్నారు. ' విద్యుత్తు సరఫరాలో అంతరాయం, లోఓల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోతున్నాయి..'..అని దేవునిగూడ రైతు గోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ' జన్నారం మండలంలో అధిక లోడు వల్లనే విద్యుత్తు లోఓల్టేజీ సమస్య వచ్చింది..'..అని జన్నారం సబ్ ఇంజినీరు అజయ్ చెప్పారు.

# పర్యవేక్షణ పూజ్యం.. నిధుల భోజ్యం

నిర్మల్ : బాసరలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం కింద బాత్‌రూం నిర్మాణానికి రూ.18 వేల వరకు ఖర్చయ్యాయయని రికార్డుల్లో రాశారు. తీరా ఇటీవల సామాజిక తనిఖీ చేయగా కేవలం రూ.11 వేలు ఖర్చు చేసినట్లు నిర్ధారించారు. ఓ సాంకేతిక నిపుణుడు జరిగిన ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తానంటూ రూ.2 లక్షలు ముందుగానే తీసుకున్నా.. ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఇలాంటి ఘటనలు తనిఖీల్లో వెల్లడి కాగా మొత్తం రూ.4,60,429 రికవరీ చేసి, రూ.72వేలు జరిమానా విధించారు.అందరినీ కొవిడ్ కాలం ఆగమాగం చేయగా.. కొందరికి ఆ సమయం కలిసొచ్చింది. రెండేళ్లుగా చేసిన పనులకు వెచ్చించిన నిధుల గురించి ఎవరూ అడగకపోవడంతో వారు ఆడిందే ఆటగా మారింది. రూ. లక్షల సొమ్ము తమ జేబుల్లో వేసుకున్నారు.. ఇదీ జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న పనుల తీరు. ఇటీవల సామాజిక తనిఖీలు చేస్తుండటంతో అక్రమాలు వెలుగులోకి వస్తోంది.జిల్లాలోని 396 పంచాయతీల్లో కూలీలకు పనులు కల్పించడంతోపాటు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వైకుంఠధామాలు, పంట కల్లాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటడం, రక్షణ కంచెల ఏర్పాటు, చెరువులు, కుంటల్లో పూడికతీత, వ్యవసాయ క్షేత్రాలు చదును చేయడం వంటి వాటిని నిర్వహిస్తున్నారు. పర్యవేక్షణ లోపం, కొలతలు



తీసే సమయంలో సరైన ప్రమాణాలు పాటించకపోవడం, లెక్కకు మించి కూలీలు పనులు చేసినట్లు కొందరు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. 2016-17 సంవత్సరం నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరం వరకు 54 సామాజిక తనిఖీలు చేయగా రూ.55,71,754 నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. ఇందులో నుంచి ఇప్పటి వరకు రూ. 29,34,758 రికవరీ కాగా, రూ.26,36,996 వసూలు చేయాల్సి ఉంది. కొవిడ్ సమయంలో గ్రామాల్లోని ప్రజలను పెద్ద ఎత్తున 'ఉపాధి' ఆదుకున్నా.. ఆ సమయంలో సామాజిక తనిఖీలు మాత్రం అంతంత మాత్రంగానే జరిగాయి. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో కేవలం ఏడు మండలాల్లో మాత్రమే నిర్వహించారు.

లొసుగులను ఆసరాగా చేసుకుని..పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఒక వైపు ప్రభుత్వం నూతన విధానాలను తీసుకొస్తున్నా.. కొందరు అందులోని లొసుగులను ఆసరాగా చేసుకొని నిధులు కాజేస్తున్నారు. ఇప్పటికే కూలీల ఖాతాలను బ్యాంకు, తపాలా శాఖలకు అనుసంధానం చేయగా, సర్కారు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వారి లెక్కను పక్కాగా గుర్తించేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం సామాజిక తనిఖీల్లో పూర్తి స్థాయిలో రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నా.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల తీరుపై ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తేనే నిధులు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, కూలీలకు పూర్తి స్థాయిలో ఆర్థిక చేయూత కలుగనుంది.కడెం మండలంలో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ పనులపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి విజయలక్ష్మి నేతృత్వంలో రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఇందులో రూ.89,548 దుర్వినియోగమైనట్లు, దీనికి అపరాధ రుసుముగా రూ. 22వేలు విధిస్తూ అధికారులు తేల్చారు.

పకడ్బందీగా పర్యవేక్షణ..ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా నిర్వహించేలా, అవకతవకలకు తావివ్వకుండా పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నాం. సామాజిక తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నాం. దుర్వినియోగమైన నిధులను సంబంధిత సిబ్బంది నుంచి వసూలు చేయిస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న పనులు, వాటి నిర్వహణ విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ? – విజయలక్ష్మి, డీఆర్డీవో

# వాహనాలకు నెంబర్లు ఏవీ?

జనగామ :పట్టణ ప్రగతి నిధులతో కోట్లాది రూపాయలు వెచ్చించి కొత్తగా వాహనాలు కొనుగోలు చేశారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్లు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఏడాదిన్నరవుతున్నా పర్మినెంటు రిజిస్ట్రేషన్లు చేయించడం లేదు. నిబంధనల ప్రకారం తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబరు 21 రోజులకే పనిచేస్తుంది. తర్వాత చెల్లుబాటవ్వదు. జీవిత కాలపు పన్ను చెల్లించి శాశ్వత నంబరు పొందాలి. అలాగే వాహన బీమా చేయించాలి. ఇవన్నీ పూర్తిచేశాకే వాహనాలు రోడ్లపై తిరగాలి. నంబర్లు లేని వాహనాలకు రవాణా శాఖ(ఆర్టీఏ), ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తారు. గ్రేటర్ వరంగల్‌కు చెందిన వాహనాలకు రిజిస్ట్రేషన్లు లేకున్నా నగరంలో తిరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు? డ్రైవర్, థర్డ్ పార్టీ బీమా లేకపోతే ఎలా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. బల్దియా ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నాయి. ఆర్టీఏ, పోలీసు శాఖాధికారులు చూసీచూడనట్లుగా ఉంటున్నారు.రిజిస్ట్రేషన్ లేకుండానే రోడ్లపైకి...: పట్టణ ప్రగతి నిధులతో కొత్తగా అనేక వాహనాలు కొనుగోలు చేశారు. వీటిలో 4 పెద్ద, 6 చిన్న రోడ్లు ఊడ్చే యంత్రాలు, 66 ట్రాక్టర్లు, 6 జేసీబీలు, 8 హెవీ టిప్పర్లు, 2 హైడ్రాలిక్ జేసీబీలు, 9 పెద్ద కంపాక్టర్లు, 10 ట్విన్ బిన్ డంపర్ ప్లేసర్లు, 2 బాబీ కార్టులు, 1 హైపవర్ వెహికిల్, 150 ఆటో టిప్పర్లు, 2 మొబైల్ షీ టాయిలెట్లు, 2 వైకుంఠ రథాలు తీసుకున్నారు. ఇందులో వందకు పైగా వాహనాలకు ఇంతవరకు పర్మినెంటు రిజిస్ట్రేషన్ నెంబర్లు, బీమా లేవు. ఏడాదిన్నర నుంచి తాత్కాలిక నంబర్లతో నడిపిస్తున్నారు. చెత్తను తరలించే వాహనాలు కావడంతో ఆర్టీఏ, పోలీసు శాఖాధికారులు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. వాహనాలు నడుపుతున్న చాలా మంది డ్రైవర్లకు లైసెన్సులు లేవు. ఈ విషయాన్ని పలుమార్లు పోలీసు అధికారులు బల్దియా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రవాణా వాహనాలు నడిపే డ్రైవర్‌కు బ్యాడ్జి లేదా హెవీ లైసెన్సు కలిగి ఉండాలి. ఇలాంటి వారినే విధుల్లోకి తీసుకోవాలి. వాస్తవంగా పరిశీలిస్తే చాలామంది డ్రైవర్లకు లైసెన్సులు లేవు. ఇంటింటి చెత్త సేకరణ చేసే స్వచ్ఛ ఆటోలు, మినీ ఆటో టిప్పర్లు అర్హత లేనివారు నడుపుతున్నారు. గ్రేటర్‌లో వాహనాల పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం ఉంది.




## ఇళ్ల నిర్మాణం.. ఏపీకి కేంద్రం రూ.20 వేల కోట్లిచ్చింది: పురందేశ్వరి

విజయవాడ: రాష్ట్రంలో రహదారుల దుస్థితేంటో ప్రజలను అడిగితే తెలుస్తుందని ఏపీ భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆమె విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పురందేశ్వరి.. వైకాపా సర్కారు తీరును ఎండగట్టారు. "రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా. భాజపాపై రాష్ట్రంలో దుష్ప్రచారం జరుగుతోంది. ఓట్లతో నిమిత్తం లేకుండా ఏపీకి భాజపా సహకరిస్తోంది. కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు రూ.6 వేలు ఇస్తున్నాం. రైతు భరోసా కింద ఇచ్చే డీబీటీల్లో కేంద్ర నిధులే ఉన్నాయి. రైతులకు రూ.12,500 ఇస్తామన్న జగన్ హామీ ఏమైంది? పదో తరగతి బాలుడిపై పెట్రోల్ పోసి చంపేశారు. అధికార పార్టీ ఎంపీ ఇంట్లో కిడ్నాపర్లు 2 రోజులున్నారు. ఇళ్ల నిర్మాణానికి 9 ఏళ్లలో రాష్ట్రానికి కేంద్రం రూ.20 వేల కోట్లు ఇచ్చింది. రాష్ట్రంలో ఇప్పటికే 65 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయి ఉండాలి. కానీ, 35 శాతం కూడా పూర్తి కాలేదనేది వాస్తవం. ఈ విషయంలో పేదలకు వైకాపా ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? రాష్ట్రంలో రహదారుల దుస్థితేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఏపీలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఉన్న పరిశ్రమలూ తరలిపోతున్నాయి" అని పురందేశ్వరి విమర్శించారు.

**తొలుత ఎన్టీఆర్ ఘాట్‌కు వెళ్లి..** విజయవాడలో బాధ్యతలు స్వీకరణ కంటే ముందు.. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌ను పురందేశ్వరి సందర్శించారు. తండ్రి ఎన్టీఆర్ సమాధి వద్ద తన నియామక పత్రాన్ని ఉంచి పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత గన్నవరం చేరుకున్న ఆమెకు.. కార్యకర్తలు భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఆపై భారీ వాహన ప్రదర్శనతో విజయవాడకు వచ్చి.. అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. పురందేశ్వరి వెంట ఏపీ భాజపా మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, నేతలు సత్యకుమార్, కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

## భారత్ లేకపోతే.. భద్రతా మండలి పరిపూర్ణం కాదు: మోదీ



దిల్లీ: పేద దేశాల ఎదుగుదలకు భారత్ వేదిక లాంటిదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత్ లేకుండా.. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి పరిపూర్ణం కాదని వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోదీ.. అంతకుముందు ప్రముఖ ఫ్రెంచ్ డెయిలీ లెస్ ఎకోస్‌తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వేదికపై భారత్ పోషిస్తున్న కీలక పాత్రను మరోసారి వివరించారు.

"అత్యధిక జనాభా, అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగిన భారత్.. ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశం కానప్పుడు ఆ మండలి ప్రపంచం కోసం ఎలా మాట్లాడగలదు?" అని మోదీ ప్రశ్నించారు. ఐరాస భద్రతా మండలిలో ఎలాంటి మార్పులు జరగాలి?ఇందుకోసం తాము ఎలాంటి పాత్ర పోషించాలి అన్నదానిపై భారత్‌తో సహా చాలా దేశాలు స్పష్టంగా ఉన్నాయని తెలిపారు.

**యుద్ధం కాదు.. ఆయుర్వేదానికే..** "యోగా అనేది ఇప్పుడు మన నిత్య జీవితంలో భాగమైంది. మా సంప్రదాయ ఔషధమైన ఆయుర్వేదాన్ని ప్రపంచమంతా ఆమోదిస్తోంది. మా నిపుణులు ఎన్నడూ యుద్ధం, అణచివేత వంటి వాటికి పాల్పడలేదు. యోగా, ఆయుర్వేదం, ఆధ్యాత్మికత, శాస్త్రం, గణితం వంటి ప్రజా ఉపయోగకర అంశాలపైనే దృష్టి సారించారు" అని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. ఇక రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై స్పందిస్తూ.. "ఈ ఉద్రిక్తతలకు ముగింపు పలకడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలకు మద్దతిచ్చేందుకు భారత్ సుముఖంగా ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే ఇరు దేశాధినేతలు పుతిన్, జెలెన్‌స్కీకి చాలా సార్లు చెప్పా. ఇది యుద్ధాల యుగం కాదని పునరుద్ఘాటిస్తున్నా. దౌత్యపరమైన చర్యలతో సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆరు దేశాలను కోరుతున్నాం" అని మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు.. ముఖ్యంగా పేద దేశాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ప్రధాని అన్నారు. ఇప్పటికే కొవిడ్ మహమ్మారితో కుదేలైన దేశాలు.. ఇప్పుడు ఆహారం, విద్యుత్తు కొరత, ఆహార సంక్షోభం, ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. అందుకే ఈ యుద్ధాన్ని ముగించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ గురువారం ఫ్రాన్స్ పర్యటనకు బయల్దేరారు. ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆహ్వానం మేరకు ఆయన.. ఆ దేశ నేషనల్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. పారిస్‌లో శుక్రవారం జరిగే నేషనల్ డే పరేడ్‌లో మోదీ పాల్గొంటారు.




దిల్లీ: భారత మార్కెట్లోకి వీలైనంత త్వరగా అడుగుపెట్టేందుకు ఎలక్ట్రానిక్ కార్ల దిగ్గజం టెస్లా ప్రయత్నాలు మరింత ముమ్మరం చేసింది. దేశంలో కార్ల ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు అవసరమైన పెట్టుబడి ప్రతిపాదనల కోసం భారత ప్రభుత్వంతో టెస్లా చర్చలు ప్రారంభించినట్లు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఏటా ఐదు లక్షల విద్యుత్తు వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యం గల ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని టెస్లా భావిస్తున్నట్లు సమాచారం. ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన కార్లను ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని దేశాలకు భారత్ నుంచే ఎగుమతి చేయాలని ఎలాన్ మస్క్ కంపెనీ ప్రణాళికలు చేస్తోందట. ఈ మేరకు ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్లు సదరు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక భారత్‌లో ఈ విద్యుత్తు వాహనాల ప్రారంభ ధర రూ.20లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ వార్తలపై టెస్లా గానీ, అటు కేంద్ర ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి స్పందనా రాలేదు. గత నెల ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఆయనతో భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మస్క్ మాట్లాడుతూ.. భారత్‌లో టెస్లా కార్యకలాపాలు వీలైనంత త్వరగా ప్రారంభమవుతాయని, త్వరలోనే దీనిపై ప్రకటన ఉండే అవకాశముందని తెలిపారు. ఈ భేటీ తర్వాతే భారత్ ప్రభుత్వంతో టెస్లా సంప్రదింపులు మొదలైనట్లు తెలుస్తోంది. భారత మార్కెట్లోకి టెస్లా ప్రవేశంపై ఎప్పటి నుంచో చర్చ జరుగుతోంది. అయితే, భారత్‌లోకి దిగుమతి చేసుకునే విలాసవంతమైన కార్లపై ప్రభుత్వం భారీ ఎత్తున సుంకం విధిస్తోంది. 'కాస్ట్ ఇన్సూరెన్స్ ఫ్రెయిట్' విలువ 40,000 డాలర్లు దాటిన కార్లపై 100 శాతం సుంకం వర్తిస్తోంది. టెస్లా మోడళ్లన్నీ దాదాపు ఈ కేటగిరీలోకే వస్తున్నాయి. దీంతో పన్నులను తగ్గించాలని టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఇక్కడి ప్రభుత్వాన్ని కోరారు. తర్వాత విక్రయాల తీరును బట్టి స్థానికంగా తయారీపై ఆలోచిస్తామని తెలిపారు.

దీనికి ప్రభుత్వం అంగీకరించలేదు. ఇతర వాహన తయారీ సంస్థల తరహాలోనే టెస్లాను సైతం పరిగణిస్తామని తేల్చి చెప్పింది. భారత్‌లోనే తయారీని చేపట్టడం వల్ల ఖర్చు చాలా తగ్గుతుందని.. అప్పుడు కార్లకు డిమాండ్ ఉంటుందని చెప్పింది. కనీసం విడి భాగాలుగా తీసుకొచ్చి భారత్‌లో అసెంబుల్ చేసే విధానం పైనైనా దృష్టి సారించాలని టెస్లాకు భారత ప్రభుత్వం సూచించింది. ఈ క్రమంలోనే గతంలో కొంతకాలం పాటు ఈ ప్రణాళికలను టెస్లా నిలిపివేయగా.. ఈ ఏడాది నుంచి మళ్లీ ప్రయత్నాలు మొదలుపెట్టింది.

## వచ్చే ఎన్నికల్లో భాజపా, జనసేన, తెదేపా పొత్తు: ఆదినారాయణరెడ్డి

అమరావతి: ఏపీలో జరిగే ఎన్నికల్లో భాజపా, తెదేపా, జనసేన మధ్య పొత్తు ఉంటుందని భాజపా నేత, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి అన్నారు.

పొత్తు దిశగానే చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో వైకాపా దుర్మార్గపు పాలనను అంతమొందించడమే లక్ష్యమని.. 3 పార్టీలు కలుస్తాయని భాజపా కేంద్ర నాయకత్వం కూడా సంకేతాలు ఇచ్చిందని తెలిపారు. ఇటీవల కేంద్ర మంత్రి నారాయణ స్వామి కూడా పొత్తులపై స్పష్టతిచ్చారని చెప్పారు. కేంద్రం సంకేతాలు లేకుంటే తానెందుకు ప్రస్తావిస్తానని వ్యాఖ్యానించారు. సీఎం జగన్‌కు కేంద్రం నుంచి ఎలాంటి అండదండలేవని.. సీబీఐ కేసుల్లో కేంద్రం అండగా ఉందనేది అపోహే మాత్రమే ఆదినారాయణరెడ్డి చెప్పారు.






## జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రాజీనామా

విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లాలో వైకాపాకు గట్టి షాక్ తగిలింది. వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆ పార్టీకి రాజీనామా చేశారు. పెందుర్తి టికెట్ విషయంలో గతకొంతకాలంగా అసంతృప్తితో ఉన్న ఆయన.. వైకాపాను వీడుతున్నట్లు ప్రకటించారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో రమేశ్‌బాబు మాట్లాడారు. "కిందిస్థాయి కార్యకర్తల సమస్యలు తీర్చలేనపుడు పదవిలో ఉండి లాభమేంటి? వైకాపా గెలుపుకోసం కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారు. వాళ్లంతా ఇప్పుడు నిరాశ నిస్పృహలో ఉన్నారు. వారిని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం చెబుదామనుకున్నాను. ఏడాదిగా ఎన్నో సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నించా.. కానీ వీలు కాలేదు. ఇలాంటి పరిస్థితిలో పార్టీలో ఉండటం సరికాదని భావించాను. అందుకే సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నా. పార్టీలో అందరితో మంచి సంబంధాలు ఉన్నాయి. తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో ఎలాంటి విభేదాలు లేవు" అని రమేశ్‌బాబు తెలిపారు.




అమరావతి: ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలోని 4 ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం విజయవాడలో మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు. ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లో కలిపి మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ నెల 20 నుంచి 25 వరకు ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టాప్ 20 వచ్చిన విద్యార్థులు అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని తెలిపారు.




దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో యమునా నది మహోగ్రరూపం దాల్చింది. భారీ వర్షాలకు ఎగువ నుంచి పెద్ద ఎత్తున నీటిని విడుదల చేస్తుండటంతో దిల్లీలోని పాత రైల్వే వంతెన వద్ద యమునా నది నీటి మట్టం ప్రమాదకరంగా పెరుగుతోంది. గురువారం నది నీటి మట్టం 208.51 మీటర్లకు చేరింది. ప్రమాదకర స్థాయి కంటే మూడు మీటర్లు ఎగువన ప్రవహిస్తోంది. యమునా నది ఈ స్థాయిలో ప్రవహించడం చరిత్రలో ఇదే తొలిసారి. భారీ వర్షాలతో హత్నీకుండ్ నుంచి హరియాణా నిరంతరంగా వరదను దిగువకు విడుదల చేస్తుండటంతో నీటి మట్టం మరింత పెరిగే అవకాశముందని కేంద్ర జల కమిషన్ అంచనా వేస్తోంది. అదే జరిగితే పరిస్థితి 'అత్యంత ప్రమాదకరంగా' మారుతుందని హెచ్చరించింది. 1978లో నీటి మట్టం 207.49 మీటర్లకు చేరడంతో దిల్లీలో భీకర వరదలు సంభవించాయి. ఇప్పుడు ఆ రికార్డును కూడా దాటడంతో ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు.


**నదులను తలపిస్తున్న రహదారులు..** యమునా నది ఉప్పొంగడంతో సమీప ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక ప్రాంతాల్లో రోడ్లపైకి మోకాలి లోతు నీరు చేరి నదులను తలపిస్తున్నాయి. సివిల్ లైన్స్ ప్రాంతంలో రింగ్ రోడ్డు పూర్తిగా నీటమునిగింది. కశ్మీరీ గేట్ - మంజు కా తిలాని కలిపే ప్రాంతంలో భారీగా వరద చేరి వాహనాల రాకపోకలకు నిలిచిపోయాయి. ఈ ప్రాంతం దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం, దిల్లీ అసెంబ్లీకి కేవలం 500 మీటర్ల దూరంలోనే ఉంది. అటు దిల్లీ సచివాలయంలోకి వరద చేరింది.వరద ముప్పు దృష్ట్యా అధికారులు అప్రమత్తమ య్యారు. ఇప్పటికే సహాయక చర్యల నిమిత్తం 12 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు, వరద పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు కొన్ని రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు వెల్లడించారు.

**తాగునీటి కొరత..** వరద ఉద్ధృతి కారణంగా దిల్లీలోని మూడు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను తాత్కాలికంగా మూసివేశారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడొచ్చని సీఎం కేజ్రీవాల్ తెలిపారు.

**హిమాచల్‌లో 90 మంది మృతి..** అటు ఉత్తరాదిన చాలా రాష్ట్రాల్లో భారీ వర్షాలు జలప్రళయం సృష్టించాయి. హిమాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు అనేక ప్రాంతాలు నీటి మునిగాయి. వరద సంబంధిత ఘటనల్లో ఈ ఒక్క రాష్ట్రంలోనే దాదాపు 90 మంది ప్రాణాలు కోల్పోయారు. అటు ఉత్తరప్రదేశ్‌లో 12 మంది మృతిచెందారు. హరియాణా, పంజాబ్‌లో 21 మంది మరణించారు. ఉత్తరాఖండ్‌లో వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అనేక జతీయ రహదారులను మూసివేశారు.

## వాలంటీర్లపై వ్యాఖ్యలు.. పవన్‌కల్యాణ్‌పై కేసు

విజయవాడ: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై కేసు నమోదైంది. వాలంటీరు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయవాడలోని కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులో నిర్వహించిన వారాహి యాత్రలో వాలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలపై సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాలంటీర్ల వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేశారని, సమాజంలో తమను తలెత్తుకోలేకుండా ఆరోపణలు చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఐపీసీ 153, 153ఏ, 505(2) సెక్షన్ల కింద పవన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.



## చంద్రయాన్-3: తిరుమల శ్రీవారి సన్నిధిలో ఇస్రో శాస్త్రవేత్తలు



తిరుపతి: తిరుమల శ్రీవారిని ఇస్రో శాస్త్రవేత్తల బృందం దర్శించుకుంది. గురువారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో ఇస్రో శాస్త్రవేత్తల బృందం స్వామి వారి సేవలో పాల్గొన్నారు. చంద్రయాన్-3 యొక్క సూక్ష్మ నమూనాలను శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చంద్రయాన్-3 ప్రయోగానికి సమయం దగ్గరపడుతోంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 2.35 గంటలకు జియో సింక్రనస్ లాంచ్ వెహికల్ ఎంకే-3(ఎల్‌వీఎం-3) రాకెట్ శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇందుకోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సైంటిస్టులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రయోగం ఎట్టిపరిస్థితుల్లోనూ గురి తప్పకూడదన్న లక్ష్యంతో శ్రమిస్తున్నామని చెబుతున్నారు. ఇప్పుడు అందరి దృష్టి ఎల్‌వీఎం-3 రాకెట్‌పైనే కేంద్రీకృతమై ఉంది. చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను చందమామ వద్దకు మోసుకెళ్లే ఈ రాకెట్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

## హాట్ నెస్ తో హీటెక్కిస్తున్న శ్రద్ధాకపూర్..!

సాహో చిత్రంతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టిన హాట్ బ్యూటీ శ్రద్ధా కపూర్ గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేదు. సోషల్ మీడియాను ఎక్కువగా వాడే వాళ్లకు ఈమె గురించి మరింత ఎక్కువగా తెలుసు. సినిమాల్లోనే కాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఎప్పుడూ అభిమానులకు దగ్గరగా ఉంటుందీ బాలీవుడ్ బ్యూటీ. తనకు సంబంధించిన సినీ అప్ డేట్లతో పాటు పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను కూడా ఫ్యాన్స్ తో షేర్ చేసుకుంటూ ఉంటుంది. ఈ క్రమంలోనే తాజాగా ఆమె ఇన్ స్టా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. బ్లాక్ డ్రెస్ లో తన లేలేత అందాలను ఆరబోసింది. జూతి కోచింగ్ క్లాసెస్.. అప్లై ఇన్ కామెంట్స్ విత్ ఎ సాంపుల్ జూత్ అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చింది. ఎద అందాలతో పాటు క్లీవేజ్ షో చేస్తూ.. ఒంపుసొంపులన్నీ చూపించింది. బ్లాక్ హై హీల్స్ వేస్కొని



డిఫరెంట్ స్టైల్ లో ఫొటోలకు పోజులు ఇచ్చింది. అందులో హాట్ లుక్స్ ఇస్తూ కుర్రకారుకు ఫీవర్ తెప్పిస్తోంది. ఓ వైపు చందమామలా మెరిసిపోతూనే.. అభిమానుల మతి పోగొట్టేస్తోంది. నయాగార ఫాల్స్ లా నడుమును తిప్పేస్తూ... కవ్వింతలు పెడ్తోంది. కళ్లతోనే మాయ చేస్తూ.. కుర్రకారుకు కైపెక్కిస్తోంది క్యూట్ బ్యూటీ. ఈ ఫొటోలు చూసిన అభిమానులు తమదైన స్టైల్ లో స్పందిస్తూ.. కామెంట్లు చేస్తున్నారు. అదిరిపోయావు హాట్ బ్యూటీ అని కొందరు.. హాట్ నెస్ మరింత పెరిగింది బ్యూటీ అంటూ చెబుతున్నారు. నీ నడుమందాలకి మేమెప్పుడూ బానిసలమే అని ఓ నెటిజన్ చెప్పగా.. బ్లాక్ డ్రెస్ లో చందమామలా మెరిసిపోతున్నావంటూ మరో అభిమాని కామెంట్ చేశాడు. అయితే శ్రద్ధా కపూర్ ఫొటోలు నెట్టింట షేర్ చేసిన కొన్ని గంటల్లోనే 17 లక్షలకు పైగా లైకులు వేలల్లో కామెంట్లు వచ్చాయి. కేవలం ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లోనే 77.6 మిలియన్ ఫాలోవర్లను కల్గిన శ్రద్ధా కపూర్.. కేవలం నటిగానే కాకుండా సింగర్ గా కూడా ఆమె మంచి గుర్తింపు తెచ్చురుంది. తీన్ పత్తి సినిమాలో చిన్న పాత్ర ద్వారా కెరియర్ ప్రారంభించి.. టాప్ హీరోల సరసన నటించింది. లవ్ కా ది ఎండ్ ఆషికి 2 సినిమాల్లో నటించి మెప్పించింది. ఆ తర్వాత హైదర్ ఏక్ విలన్ ఏబీసీడీ భాగీ సినిమాల్లో నటించి విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది.

## తడిసిన నడుము నాభి అందాల జాన్వీ

అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది. అయినా కూడా ఇప్పటి వరకు హీరోయిన్ గా ఒక బిగ్ కమర్షియల్ సక్సెస్ దక్కించుకోలేక పోయింది. అయినా కూడా బాలీవుడ్ హాట్ స్టార్ బ్యూటీస్ కు ఉన్నంత క్రేజ్.. ఫాలోయింగ్ ఈ అమ్మడికి ఉంది అనడంలో సందేహం లేదు. కేవలం ఫొటో షూట్స్ తోనే ఆ స్థాయి గుర్తింపును దక్కించుకుంది. హిందీలో ఇప్పటి వరకు ఒక్క హిట్ లేకున్నా కూడా ఈ అమ్మడిని భారీ పారితోషికం ఇచ్చి తెలుగు సినిమాల్లో నటింపజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు అంటే ఇలాంటి ఫొటోలే కారణంగా చెప్పుకోవచ్చు. సాదారణంగానే అందాల ఆరబోత విషయంలో జాన్వీ



కపూర్ నోరు వెళ్లబెట్టేలా చేస్తుంది. అలాంటి జాన్వీ కపూర్ ఈసారి అంతకు మించి అన్నట్లుగా తన తడిసిన అందాల నడుము మరియు నాభిని చూపిస్తూ మతి పోగొడుతోంది. వైట్ చీర లో క్లీ వేజ్ షో చేస్తూ నడుము నాభి అందాన్ని చూపిస్తూ కవ్విస్తున్న జాన్వీ కపూర్ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. జాన్వీ కపూర్ ఇటీవలే ఎన్టీఆర్ కి జోడీగా కొరటాల శివ దర్శకత్వంలో నటించేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. రామ్ చరణ్ కు జోడీగా కూడా ఈ అమ్మడు నటించబోతుందని వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది కచ్చితంగా రెండు మూడు తెలుగు సినిమాలతో అయినా జాన్వీ కపూర్ టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సందడి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.




## క్లీవేజ్ షోతో కోహ్లీ భార్య.. స్టన్నింగ్



టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ భార్య బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ రోజురోజుకూ తన గ్లామర్ డోస్ ను పెంచుకుంటూ పోతోంది. క్లీవేజ్ షోతో రెచ్చిపోతూ కుర్రకారును హీటెక్కిస్తోంది. రబ్ నే బనాతే జోడీ సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ.. తల్లయ్యాక మరింత అందంగా తయారైంది. తనకు సంబంధించిన ఫొటోలు సినీ అప్ డేట్లను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడయాను ఓ ఊపు ఊపేస్తుంది. 62 మిలియన్ల ఫాలోవర్లను కల్గిన ఈ హాట్ బ్యూటీ.. తాజాగా కొన్ని ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఎల్లో కలర్ షాట్ టాప్ విత్ జీన్స్ వేస్కొని ట్రెండీ లుక్ లో కనిపించింది. అంతే కాదండోయ్ ఇట్ వాస్ ఆల్ విండీ బట్ ద మూడ్ వాస్ సన్నీ అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చి తన మనసులోని భావాలను వ్యక్తం చేసిందీ ముద్దుగుమ్మ. వాతావరణం చల్లగా ఉన్నా.. లోపల అంతా హీటెక్కిపోతోందని చెప్పింది. ప్రస్తుతం అనుష్క షేర్ చేసిన ఈ ఫొటోలతో పాటు ఆమె రాసిన క్యాప్షన్ కూడా నెట్టింట తెగ వైరల్ గా మారింది. ఈ ఫొటోల్లో అనుష్క ఎద అందాలతో పాటు క్లీవేజ్ షో చేసింది. ఎద అందాలను ఎత్తి చూపిస్తూ ఓ ఫొటోలో... చేతులు జేబులో పెట్టుకొని మరో ఫొటోకు ఫోజులిచ్చింది. బెడ్ వద్ద నిల్చొని క్యూట్ అండ్ హాట్ లుక్స్ ఇస్తూ కుర్రకారుకు గుండెల్లో హీట్ పెంచేస్తోంది. ఈమె ఫొటోలు షేర్ చేసిన కొన్ని గంటల్లోనే లక్షల్లో లైకులు వేలల్లో కామెంట్లు చేశారు అభిమానులు. నీకేం కావాలో మాకు అర్థమైందని కొందరు కామెంట్లు చేయగా.. చాలా హాట్ గా ఉన్నావంటూ మరికొంత మంది చెబుతున్నారు. ఆర్మీ ఆఫీసర్ కూతురు అయిన ఈ బాలీవుడ్ బ్యూటీ.. తన నటనకు ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో మాత్రమే నటించింది. రబ్ నే బనాతే జోడీ బద్మాష్ కంపెనీ బ్యాండ్ బాజా బారాత్ పటియాల హౌస్ లేడీస్ వర్సెస్ రిక్కి భెల్ జబ్ తక్ హై జాన్ మాతృకి బిజీలీ కా మండోలా పీకేలో నటించి తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకుంది. తాజాగా బాంబే వెల్వెట్ చిత్రం నటిస్తూ బిజీగా ఉంది.

## ఇంకా మహేష్ ని ఫాలో అవుతున్న బొమ్మాళీ



తన సినిమాల రిలీజ్ లకు ముందు రిలీజ్ తర్వాత విదేశీ వెకేషన్లతో రిలాక్స్ అవ్వడం మహేష్ కి అలవాటు. మహేష్ తన పిల్లలు కుటుంబంతో కలిసి సెలబ్రేషన్ మోడ్ లో ఉంటారు. ఇప్పుడు అతడి లానే విదేశీ వెకేషన్లతో సెలవులను ఎంజాయ్ చేయడాన్ని అలవాటు చేసుకుంది రష్మిక మందన. ఇటీవల ఈ బ్యూటీ తరచుగా విదేశీ వెకేషన్లకు వెళుతోంది. ముఖ్యంగా వరుస సినిమా షెడ్యూళ్లతో తీవ్రంగా అలసిపోతున్నందున రిలాక్స్ అయ్యేందుకు రిజనవేషన్ కోసం విదేశీ సముద్ర తీరాలను విలాసవంతమైన జీవన విధానాన్ని ఎంపిక చేసుకుంటోంది. రష్మిక నటించిన తాజా చిత్రం 'మిషన్ మజ్ను' విడుదలకు ముందు విశ్రాంతి తీసుకోవాలన్న తన కోరికను బహిర్గతం చేసింది. కొద్దిరోజుల పాటు విహారయాత్రకు వెళ్లాలనుకుంటోంది. ఇదే విషయాన్ని సోషల్ మీడియా పోస్ట్ లో పేర్కొంది. తనను హాలీడే బగ్ (పురుగు) కరిచిందని సెలవులను ఆస్వాధించాలనుకుంటున్నానని ఇన్ స్టా పోస్ట్ లో తెలిపింది. అంతేకాదు.. ఇటీవలి హాలిడే ట్రిప్ నుండి ఒక ఫోటోని కూడా రష్మిక షేర్ చేసింది. ఈ ఫోటోలో కుర్తా -ప్రింటెడ్ పలాజో ధరించి సుందరమైన లొకేషన్ ని ఆస్వాధిస్తూ రిలాక్స్ డ్ గా కనిపిస్తోంది. బ్లాక్ సన్ గ్లాసెస్ తో స్టైలిష్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఇంతలోనే 'మిషన్ మజ్ను' గురించి రష్మిక సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ ఇందులో తన పాత్ర నస్రీన్ గురించి అద్భుతంగా వర్ణించింది. "షరతులు లేని ప్రేమ.. అమాయకత్వం .. వామ్ నెస్ ని ప్రదర్శించే పాత్ర ఇది. తన ప్రియమైన వ్యక్తికి ఎల్లప్పుడూ బేషరతుగా మద్దతు ఇస్తుంది. ఆమె నొప్పిని నిస్సహాయతను బాధలను నిశ్శబ్దంగా భరించి..తన ప్రేమను దక్కించుకోగలుగుతుంది. ఎవరు ఏం చేసినా- ఆమె అత్యంత ఇష్టపడే వ్యక్తిలో చిరునవ్వును తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది. తాను పరిపూర్ణంగా కాదని తనకు తెలుసు.. కానీ ఆవెు చేయుగలిగిన ప్రతిదానిలో ఆనందాన్ని ఓదార్పును పొందుతుంది.." అంటూ తన పాత్ర గురించి వర్ణించింది. ఈ చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రా యుద్ధ వీరుడిగా నటించాడు.

అతడి ప్రేయసిగా రష్మిక నటించింది. ఇండియా- పాకిస్తాన్ వార్ నేపథ్యంలో నిజజీవిత ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం మిషన్ మజ్ను. షేర్షా తరహాలోనే దేశభక్తి జానర్ లో తెరకెక్కింది. ఈ సినిమాలో రష్మిక పాత్ర అభిమానులను సర్ ప్రైజ్ చేయనుందని... ఈ మూవీలో సిద్ధార్థ్ మల్హోత్రాతో రొమాంటిక్ యాంగిల్ చాలా ప్రత్యేకంగా ఉంటుందని టాక్ వినిపించింది. మిషన్ మజ్ను ఈనెల 20 నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది.

## శకుంతలలా అరియానా గ్లోరీ... బర్త్డే ట్రీట్..

బిగ్బాస్ సీజన్-4తో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది ప్రముఖ సోషల్ మీడియా యాంకర్ అరియానా గ్లోరీ. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్గానే ఉండే ఈ భామ.. అందాల ఆరబోతలో కూడా ఎప్పుడూ ముందే ఉంటుంది. క్రేజీ పోస్టులు పెడుతూ.. నెటిజన్లను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అయితే ఆర్జీవీతో చేసిన ఇంటర్వ్యూతో ఒక్కసారిగా ఫుల్ పాపులారిటీ సంపాదించుకున్న ఈ భామ.. ఆ తర్వాత హాట్ బ్యూటీగా యూత్లో మరింత క్రేజ్ తెచ్చుకుంది. ఇక అప్పటి నుంచి గ్లామర్ షోలో ఏ మాత్రం తగ్గడం లేదు. హద్దుల్ని చెరిపేస్తూ మరీ అందాలను ఆరబోస్తోంది. ఇందుకోసం అదిరిపోయే అవుట్ ఫిట్లలో మతులు పోయేలా ఫొటోషూట్లు చేస్తుంది. ఆ ఫొటోలను నెట్టింట పోస్టూ కుర్రాళ్ల గుండెల్లో మంట పుట్టిస్తోంది. అయితే నేడు ఈ ముదుగుమ్మ



పుట్టినరోజు. దీంతో తాజాగా తన ఇన్స్టాలో ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త ఫొటోస్ను పోస్ట్ చేసింది. 'నన్ను నేను ఎంతగా ఇష్టపడతానో అది నా ఫ్యాషన్ ద్వారానే తెలుస్తుంది.. ఈ రోజు నా పుట్టినరోజు' అని వ్యాఖ్య రాసుకొచ్చింది. ఇందులో ఆమె తెల్లటి దుస్తులతో.. శాకుంతలలా మారి.. అందలను ఆరబోస్తూ కనిపించింది. తెల్లటి వస్త్రాల్లో ఈ ముద్దుగుమ్మ పరువాలను ప్రదర్శిస్తూ.. ఊపిరాడకుండా చేసింది. అటు బొడ్డు అందాలు.. ఇటు ఎద అందాలను వలకబోస్తూ... పక్కనే ఓ తెల్లటి కుండతో కూర్చొని ఉంది. ఈ అందాల ధాటికి కుర్రాళ్లు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఇక ఆ నడుము అందాలను చూసి మతి పోగొట్టుకుంటున్నారు. ఈ పిక్స్ వైరల్ చేస్తూ... యంగ్ బ్యూటీని ఎంకరేజ్ చేస్తున్నారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక ఈ భామ వ్యక్తిగత విషయానికొస్తే.. జనవరి 25 1993లో పుట్టింది. బిగ్ బాస్ తెలుగు షో తో ఫేమ్ సంపాదించుకున్న ఈమె ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ యాంకర్గా అవకాశాలను అందుకుంటుంది. ప్రస్తుతం బీబీ జోడీతో ఆకట్టుకుంటోంది ఈ భామ. అలానే హాట్ ఫొటోలను షేర్ చేస్తూ.. తన అందాలను ఆరబోస్తూ.. ఫోటోలను షేర్ చేస్తూ.. అటు నెటిజన్స్ కు... ఇటు బుల్లితెర ఆడియెన్స్కు మరింత దగ్గరవుతూ అలరిస్తోంది.

## ఎత్తు అందాలతో మతి పోగొడుతున్న లేడీ గూఢచారి

మన తెనాలి ముద్దుగుమ్మ శోభిత ధూళిపాళ్ల బాలీవుడ్ ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా అందాల ఆరబోత చేస్తోంది. హీరోయిన్ గా మొదట హిందీలో సత్తా చాటి ఆ తర్వాత తెలుగు లో సినిమాలను చేస్తోంది. తెలుగు లో గూఢచారి సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన శోభిత వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. కేవలం హీరోయిన్ గా మాత్రమే కాకుండా తనకు వచ్చిన ప్రతి ఒక్క పాత్రకు న్యాయం చేస్తూ నటిగా తనను తాను నిరూపించుకుంటూ ఉంది. తాజాగా మేజర్ మరియు పొన్నియిన్ సెల్వన్ సినిమాలతో అలరించిన శోభిత ఈ ఏడాది మరో మూడు నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు



కనిపిస్తున్నాయి. నటిగా ఇంత బిజీగా ఉన్న శోభిత ధూళిపాళ్ల రెగ్యులర్ గా అందాల ఆరబోత చేస్తూ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. మ్యాగజైన్ కవర్ ఫొటో లకు ఫోజ్ లు ఇచ్చే శోభిత తాజాగా షేర్ చేసిన ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

శోభిత ధూళిపాళ్ల యొక్క అందాల విందు కు ప్రతి ఒక్కరు కూడా అవాక్కవుతున్నారు. శోభిత ధూళిపాళ్ల సైడ్ యాంగిల్ లో ఎద ఎత్తు అందాలను చూపిస్తూ కవ్విస్తోంది బాబోయ్ అంటూ నెటిజన్స్ కొంటెగా కామెంట్స్ చేస్తూ ఈ అమ్మడి యొక్క అభిమానులుగా మారిపోతున్నారు. ఈ స్థాయి అందాల ప్రదర్శణ చేస్తే కుర్రకారు ఏమై పోవాలి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.




# కమలంలో ప్రక్షాళన తప్పదా ?

హైదరాబాద్ : తెలంగాణా బీజేపీ లో తొందర లోనే ప్రక్షాళన జరగబోతోందట. ఇపుడున్న రాష్ట్ర కార్యవర్గం లో మెజారిటి మాజీ అద్యక్షుడు బండి సంజయ్ మద్దతుదారులే ఎక్కువ. బండి మద్దతుదారుల ను అలాగే పెట్టుకుని తాను పార్టీని నడపటం కష్టమని కొత్త అధ్యక్షుడు కిషన్ రెడ్డి డిసైడ్ అయ్యారట. తనకంటు కొత్త టీమును ఏర్పాటుచేసుకోవటానికి అధిష్టానం నుండి కిషన్ గ్రీన్ సిగ్నల్ కూడా అందుకున్నట్లు పార్టీవర్గాల టాక్. కాకపోతే నూటికి నూరుశాతం కొత్తవాళ్ళతో నింపటం సాధ్యంకాదు. అందుకనే పాత–కొత్తల మేలు కలయికగా కార్యవర్గం ఉండబోతోందని సమాచారం. పనిలోపని గా రాష్ట్ర కార్యవర్గంతో పాటు జిల్లాల అధ్యక్షులతో పాటు కార్యవర్గాల ను కూడా మార్చాలని అనుకున్నారట. అమెరికా లో జరుగుతున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) సభల కు వెళ్ళాలన్నది కిషన్ ఆలోచన. అమెరికా కు వెళితే వచ్చిన తర్వాత కసరత్తు పూర్తిచేసి ఒకసారి అధిష్టానంతో మాట్లాడి ఆ తర్వాత ప్రకటించే ఆలోచన లో ఉన్నారట. అమెరికా కు గనుక వెళ్ళకపోతే ప్రకటన కొంచెం ముందే ప్రకటన ఉంటుందని పార్టీవర్గాలు చెప్పాయి. ఇక్కడ విషయం ఏమిటంటే అధ్యక్షుడిగా ఎవరున్నా కార్యవర్గంలో ఎంతమందున్నా పెద్దగా తేడా ఉండదని అనుకుంటున్నారు. ఎందుకంటే అధికారం లోకి బీజేపీ వచ్చేయబోతోందనే మునుపటి జోష్ ఇపుడు కనబడటంలేదు. కనబడటం లేదు అనేకన్నా అవకాశాన్ని పార్టీయే జారవిడుకుంటున్నదా అనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. రాబోయే ఎన్నికల్లో అధికారం కోసం ఒకవైపు బీఆర్ఎస్ మరోవైపు కాంగ్రెస్ తీవ్రంగా పోటీపడుతున్నాయి. ఏ సర్వేలో చూసినా బీజేపీ మూడోస్థానానికి పడిపోయిందనే తెలుస్తోంది. మంచో చెడో బండి సంజయ్ పార్టీకి తెలంగాణా లో మంచి ఊపుతెచ్చారు. బండేమో దూకుడుగా వెళ్ళే వ్యక్తి. అదే కిషన్ అయితే సౌమ్యుడుగా పేరున్న నేత. ప్రత్యర్ధుల పై మరీ నాటుగానో లేకపోతే సినిమా భాషలో చెప్పినట్లుగా ఊరమాస్ గా డైలాగులు పంచులు విసరలేరు. ప్రస్తుత రాజకీయాల్లో సౌమ్యంగా మాట్లాడితే చాలామందికి నచ్చటంలేదు. క్యాడర్ కు అసలే నచ్చదు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ దెబ్బకు బీజేపీ గ్రాఫ్ బాగా పడిపోయినట్లు తెలుస్తోంది. స్కామ్ లో కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయలేకపోవటమే బీజేపీకి పెద్ద మైనస్ అయిపోయింది. బీజేపీ బీఆర్ఎస్ ఒకటే అనే అభిప్రాయం జనాల్లోకి వెళ్ళిపోవటంతో పార్టీ మీద దెబ్బపడిపోయింది. అందుకనే అధ్యక్షుడి గా ఎవరున్నా ఒకటే.




# నువ్వా మా విద్యార్థుల గురించి మాట్లాడేది.. బొత్సకు గంగుల స్ట్రాంగ్ కౌంటర్

కరీంనగర్: ఏపీ విద్యా విధానాన్ని ఆఫ్ట్రాల్ తెలంగాణతో పోల్చి చూడటం సరికాదు అంటూ ఏపీ మంత్రి బొత్ససత్యానారాయణ చేసిన వ్యాఖ్యలపై మంత్రి గంగుల కమలాకర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఫెయిల్ అయిందన్నారు. "బొత్స సత్యనారాయణ ముందు నువ్వు తెలుసుకో.. నీ దగ్గర ఉన్న గురుకులాలు ఎన్ని.. మా దగ్గర ఎన్ని ఉన్నాయో చూడు. నీ తలకాయ ఎక్కడ పెట్టుకుంటావు.. నీ దగ్గర విద్యా వ్యవస్థ ఉందా.. నువ్వా మా విద్యార్థుల గురించి మాట్లాడేది. మా దగ్గర 1009 గురుకులాలు ఉంటే.. నీ దగ్గర 289 కూడా లేవు.. టీఎస్‌పీఎస్సీలో దొంగలను పట్టుకుంది మేమే. ఏపీపీఎస్సీలో సీతారామరాజు అనే దొంగ అడ్డంగా దొరకలేదా. జగన్ దొంగ నాటకాలను ప్రజలు చూస్తున్నారు. తెలంగాణ మీద ఇంకా కుట్రలేనా" అంటూ మంత్రి గంగుల విరుచుకుపడ్డారు.

**హిమాన్షు చెప్పింది కరెక్టే...** అలాగే – సీఎం కేసీఆర్ మనుమడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదన్నారు. ఉమ్మడి పాలన పాపాలను కడిగేస్తున్నామన్నారు. మన ఊరు... మన బడితో పాఠశాల రూపురేఖలు మార్చామని మంత్రి గంగుల కమలాకర్ చెప్పుకొచ్చారు.

**ఇంతకీ హిమాన్షు ఏమన్నారంటే...** అన్ని హంగులతో రూపుదిద్దుకున్న హైదరాబాద్ గౌలిదొడ్డిలోని కేశవనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పుట్టిన రోజు సందర్భంగా హిమాన్షు నిన్న (బుధవారం) ప్రారంభించారు. ఈ పాఠశాలలో పరిస్థితిని చూసి చలించిన హిమాన్షు స్కూల్‌ను దత్తత తీసుకుని, తాను సేకరించిన నిధులతో బడిని ఆధునికీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిమాన్షు భావోద్వేగంగా ప్రసంగించారు. తాను తొలిసారిగా ఈ బడిని సందర్శించినప్పుడు సౌకర్యాల లేక అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులను చూసి ఎంతో బాధపడ్డానని.. కళ్లలోంచి నీళ్లొచ్చాయని హిమాన్షు పేర్కొన్నారు. కాగా.. కేశవనగర్ ప్రభుత్వ పాఠశాల పరిస్థితిపై హిమాన్షు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రాష్ట్రంలో ప్రభుత్వ బడుల దుస్థితికి హిమాన్షు వ్యాఖ్యలే నిదర్శనమంటూ పలువురు నెటిజన్లు వ్యాఖ్యలు చేశారు.




హైదరాబాద్: ఉచిత విద్యుత్‌పై రాష్ట్రంలో తీవ్ర రచ్చ జరుగుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు తన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చిన రేవంత్ కాసేపటి క్రితమే మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ఊర్లో పెళ్లికి కుక్కల సందడిలాగా పుట్టలో పడుకున్న పాములు బయటకి వచ్చి తనను నిందిస్తున్నారని మండిపడ్డారు. అమెరికాలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో కొందరు నిపుణులు తెలంగాణ ప్రభుత్వ పాలసీలపై ప్రశ్నలు సంధించారని... కాంగ్రెస్ పార్టీ విధివిధానాలు తాను క్లియర్‌గా వివరించినట్లు చెప్పారు. తాను చెప్పిన సమాధానంలో కొంత భాగాన్ని కట్ చేసి ప్రచారం చేశారని ఆరోపించారు. ఐటీ మంత్రి అతి తెలివి ప్రదర్శించి చిల్లర వ్యవహారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్‌పై మరోసారి చర్చ జరగడం మంచిదే అని అన్నారు. 2004 ఎన్నికల మేనిఫెస్టోలో ఉచిత విద్యుత్ అంశాన్ని కాంగ్రెస్ ప్రకటించిందని.. ఉచిత కరెంట్ ఇవ్వడం కుదరదని తెలుగుదేశంతో చెప్పించిన వ్యక్తి చంద్రశేఖర్ రావు అని చెప్పుకొచ్చారు. నాడు విద్యుత్ ఉద్యమంలో రైతులను చంపిన పాపం ముమ్మాటికీ కేసీఆర్ దే అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ వస్తే వ్యవసాయంలో ఇద్దరం పోటీ పడదామన్నారు. "నేను వ్యవసాయం తెలిసిన వాడిని. దుక్కి దున్నిన వాడిని. కేటీఆర్ లాగా అమెరికాలో బాత్‌రూంలు కడగలేదు. నేను పాస్ పోర్ట్ బ్రోకర్ కొడుకుని కాదు. నేను దళారీ కొడుకును కాదు" అంటూ రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# మూడో రోజు అదే జోరు..రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అన్నదాతల ఆగ్రహం



హైదరాబాద్ : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది.

రైతులకు 3 గంటల ఉచిత విద్యుత్ చాలు, 24 గంటల విద్యుత్ అవసరంలేదన్న అనుచిత వ్యాఖ్యలపై మూడు రోజు కూడా తెలంగాణ వ్యాప్తంగా నిరసనల హోరు కొనసాగుతున్నది. నోటికాడిబుక్కను ఎత్తగొట్టే కాంగ్రెస్ ఆలోచనపై అన్నదాతలు నిప్పులు చెరిగారు. రాష్ట్రవ్యాప్తంగా రేవంత్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఆ పార్టీకి ఓటు వేయబోమని తీర్మానాలు చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. రైతు వ్యతిరేక ఆలోచనలను బూడిద చేస్తామంటూ హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు ఇలా రోజుకో తీరుగా నిరసనలు తెలియజేస్తూ కాంగ్రెస్‌కు కరెంట్ షాక్ ఇస్తున్నారు. రైతు వ్యతిరేకి రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

# అది నిరూపిస్తే ఎంపీ పదవికి రాజీనామాకు సిద్ధమని కేటీఆర్‌కు కోమటిరెడ్డి సవాల్



యాదాద్రి : భువనగిరి మండలం బండ సోమారం విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సందర్శించారు. సబ్ స్టేషన్‌లో కరెంటు సప్లై రిజిస్టర్‌ని తనిఖీ చేసి సబ్ స్టేషన్ ఆపరేటర్‌తో కోమటిరెడ్డి మాట్లాడారు. 24 గంటల కరెంటు అనేది పచ్చి అబద్ధమన్నారు. 11 గంటల విద్యుత్ మాత్రమే ఇస్తున్నారని.. అందులోనూ కోతలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు సరైన సమయంలో వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగులందరూ కష్టాల్లో ఉన్నారని.. జీతాలు రాక ఈఎంఐలు కట్టక అప్పుల పాలవుతున్నారని అన్నారు. 11 గంటల కంటే విద్యుత్ ఎక్కువ ఇచ్చినట్టు నిరూపిస్తే ఎంపీ పదవికి రాజీనామాకు సిద్ధమని కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

# ఉచిత విద్యుత్‌పై ఆగని మంటలు.. కరీంనగర్‌లో ఏకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ

కరీంనగర్: జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఫ్లెక్సీల వార్ నడుస్తోంది. ఉచిత కరెంట్ అవసరం లేదంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుబట్టిన విషయం తెలిసిందే. రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనకు కూడా చేసింది. తాజాగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జిల్లాలో బీఆర్ఎస్ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై కోపంతో ఊగిపోయిన కాంగ్రెస్ నేత రోహిత్ రావు.. బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. అసలు ఆ ఫ్లెక్సీలో ఏముందంటే... "మూడు గంటలు కరెంట్ చాలన్న కాంగ్రెస్‌కు మా గ్రామంలో ప్రవేశం లేదు. కబర్దార్ కాంగ్రెస్ నేతల్లారా" అంటూ బీఆర్ఎస్ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలను చూసిన కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రోహిత్ రావు... ఆ ఫ్లెక్సీలను వాటిని చించివేశారు.


**హైదరాబాద్‌కు రేవంత్..** మరోవైపు... టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నారు. తానా సభల్లో ఉచిత విద్యుత్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలతో తెలంగాణలో పాలిటిక్స్ హీటెక్కాయి. తాజా పరిణామాలతో రేవంత్ ఎలాంటి కార్యచరణ ప్రకటిస్తారోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది. బీఆర్ఎస్ ఆందోళనపై ఇప్పటికే ట్విట్టర్ వేదికగా రేవంత్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఎంత దుష్ప్రచారం చేసినా వచ్చేది కాంగ్రెస్ అని... ఉచిత విద్యుత్ ఇచ్చేది కాంగ్రెస్ అంటూ రేవంత్ కౌంటర్ ఇచ్చారు. ఈరోజు (గురువారం) రేవంత్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో రేవంత్ మీడియా సమావేశం అనంతరం ఉచిత్ విద్యుత్‌పై చెలరేగుతున్న మాటలు మంటలకు ఫుల్‌స్టాప్ పడుతుందో లేదో చూడాలి.

# ఉచిత విద్యుత్‌పై రచ్చ... రేవంత్‌ను ధర్మపురి అరవింద్ ఎంత మాట అనేసారో...



హైదరాబాద్: రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అంశం ఒక్కసారిగా పొలిటికల్ హీట్‌ను పెంచేసింది. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా తప్పుబడుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తాజాగా ఉచిత విద్యుత్‌పై బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన కామెంట్స్ హాట్ టాపిక్‌గా మారాయి. ఇంతకీ నిజామాబాద్ ఎంపీ ఏమన్నారంటే.. ఉచిత విద్యుత్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యల వెనుక సీఎం కేసీఆర్ ఉన్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉచిత విద్యుత్‌పై కోమటరెడ్డి వెంకటరెడ్డి తప్పా?.. రేవంత్ రెడ్డి కరెక్టా? చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. రేవంత్ రెడ్డి బిజినెస్ పార్టనర్స్ అని అన్నారు. మూడు గంటలు కరెంట్ చాలని రేవంత్ రెడ్డికి ఏ రైతు చెప్పారని ప్రశ్నించారు. కేసీఆర్ ఆడిస్తే.. రేవంత్ రెడ్డి ఆడుతున్నారని విరుచుకుపడ్డారు. రాజకీయంగా రేవంత్ రెడ్డిని పెంచాలో.. తగ్గించాలో.. అంతా కేసీఆర్ చెప్పినట్లు నడుస్తోందని అన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డికి సీఎం కేసీఆర్ డబ్బులు పంపుతున్నారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ బీ ఫాంలు సీఎం కేసీఆర్ చేతి నుంచే వెళ్తాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గెలిచాక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్ళరని రేవంత్ రెడ్డి గ్యారంటీ ఇవ్వగలరా అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ హాట్ కామెంట్స్ చేశారు.


# తెలంగాణలో ఆలయాలకు పూర్వవైభవం: మంత్రి ఎర్రబెల్లి



యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయం ఇల వైకుంఠపురంగా వెలిసిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో భవిష్యత్తులో గొప్ప క్షేత్రంగా విరాజిల్లుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తిరుపతి, ఇంద్రకీలాద్రి తరహాలో యాదగిరిగుట్ట యాదాద్రి దేవాలయాన్ని పునర్‌నిర్మించి సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు. తెలంగాణలో దేవాలయాలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. కుటుంబ సమేతంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని మంత్రి ఎర్రబెల్లి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. చరిత్రలో నభూతో న భవిష్యత్తు అన్న చందంగా సీఎం కేసీఆర్ యాదాద్రి దేవాలయాన్ని పునర్ నిర్మించారని చెప్పారు. దేవాలయం మొత్తం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అద్భుతంగా ఉందని, నిర్మాణ కౌశలం భక్తి పారవశ్యం పొంగిపొరలే విధంగా జరిగిందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే దేవాలయాలకు పూర్వవైభవం వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి తలపెట్టిన కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని కోరుకున్నట్లు వెల్లడించారు.

# రేవంత్ ప్రకటన వెనక ఇంతుందా ?



హైదరాబాద్ : అమెరికా పర్యటనలో ఉన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఒక ప్రకటనచేశారు. అదేమిటంటే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీతక్కే ముఖ్యమంత్రని. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన నియోజకవర్గం ములుగు నుండి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముఖ్యమంత్రి అభ్యర్ధిగా సీతక్క పేరును ఎందుకు ప్రకటించారో చాలామంది సీనియర్లకు ముందు అర్ధంకాలేదు. అందుకనే ముఖ్యమంత్రి ఎవరో ప్రకటించేందుకు రేవంత్ ఎవరు ? రేవంత్ స్ధాయి ఏమిటంటు కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి వాళ్ళు మండిపోయారు. అయితే సీతక్క పేరును రేవంత్ ప్రకటించటం వరకు చాలా కతే ఉందట. అదేమిటంటే సీతక్కకు ములుగు నియోజకవర్గంలో మంచిపట్టుంది. అందుకనే ఆమె గెలుస్తున్నారు. తెలంగాణాలో గిరిజన జనాభా చాలా ఎక్కువుంది. పార్టీలకు అతీతంగా సీతక్కు (అనసూయ)కు మంచి పేరుంది. గిరిజన ఓట్లను మొత్తం కాంగ్రెస్ వైపు ఆకర్షించటంలో భాగంగా సీతక్క పేరును రేవంత్ వ్యూహాత్మకంగా ప్రకటించారట. గిరిజనలు మొత్తం గుండుగుత్తగా కాంగ్రెస్ కు ఓట్లేస్తే మంచి ఊపురావటం ఖాయం. తెలంగాణాలో ఎస్సీ ఎస్టీ తర్వాత బీసీల జనాభా ఎక్కువగా ఉంది. 2014 ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే దళితుడే సీఎం అవుతారని స్వయంగా కేసీయార్ ప్రకటించారు. అయితే తెలంగాణా ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే దళిత సీఎం ప్లేసులో కేసీయారే సీఎం అయ్యారు. అప్పటినుండి దళితులకు ఇంతవరకు చాన్సురాలేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రేవంత్ గిరిజనురాలైన సీతక్కను ముఖ్యమంత్రి అభ్యర్ధిగా ప్రకటించారట. ఎస్టీలకు సీఎం అభ్యర్ధి అన్నపుడు ఎస్సీలు కూడా కాంగ్రెస్ వైపు వస్తే గెలుపు ఖాయమన్నది రేవంత్ వ్యూహం. సీతక్క సీఎం అభ్యర్ధని రేవంత్ ప్రకటించిన తర్వాత కోమటిరెడ్డి లాంటి ఒకళ్ళిద్దరు తప్ప ఇంకెవరూ నోరిప్పలేకపోతున్నారు. ఎందుకంటే గిరిజనులకు సీఎం పోస్టన్నపుడు వ్యతిరేకిస్తే భవిష్యత్తు ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవన్నది కాంగ్రెస్ నేతల భయం. అందుకనే రేవంత్ ప్రకటనపై ఇష్టమున్నా లేకపోయినా నోరెత్తలేకపోతున్నారు. సీతక్కకు బాగా కలిసొచ్చే అంశాలు ఏమిటంటే ఆమె ఫార్మర్ మావోయిస్టు. అలాగే కష్టాల్లో ఉన్న గిరిజనులను లేదా ఇతర జనాలు పిలిస్తే చాలు వెంటనే సీతక్క స్పందిస్తారు. రేవంత్ ప్రకటన వరకు బాగానే ఉంది మరి చివరకు ఏమవుతుందో చూడాలి.

# ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి నిర్వహిస్తున్న అతి రుద్ర మహాయాగంలో అపశృతి..



వికారాబాద్ : వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నిర్వహిస్తున్న అతి రుద్ర మహాయాగంలో అపశృతి చోటు చేసుకుంది. చివరి రోజు పూర్ణ ఆహుతిలో మంటలు ఎగిసి పడ్డాయి. టెంట్లు, హోమ గుండాలు కాలి బూడిద అయ్యాయి. అక్కడున్న వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మూడు రోజులుగా ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి దంపతులు అతిరుద్ర మహాయాగం నిర్వహిస్తున్నారు. నేటితో యాగం ముగిసింది. పూర్ణాహుతి కార్యక్రమంలో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో మండపంలోని వారంతా ఆందోళనకు గురై అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. క్షణాల్లోనే ఆ మంటలు కాస్త టెంట్‌కు వ్యాపించాయి. క్షణాల్లో మండపం మొత్తం అగ్ని కీలల్లో చిక్కుకుపోయింది. ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. ఈ ఘటనపై పైలట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు, తన కుటుంబానికి ఎలాంటి హానీ జరగలేదని.. ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే యాగం ముగిసే రోజు ఇలా జరగడం బాధాకరమన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com